




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక
PEN POWER TELUGU DAILY
ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 11 సంచిక : 310 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ బుధవారం 16 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :310 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA WED 16 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur







## రూ. లక్ష కోట్ల పెట్టుబడులకు 95 సంస్థలు ముందుకువచ్చాయి

- ఏపీలో రాబోయే నాలుగేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు
- అధికారులకు మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం
- సంస్థలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచన

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ద్వారా 10 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ లక్ష్యాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, జీసీసీలు, డేటా సెంటర్ల స్థాపనకు ఇప్పటివరకు 95 ప్రముఖ సంస్థలు రూ. లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని మంత్రి తెలిపారు. ఈ సంస్థలు త్వరితగతిన తమ యూనిట్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు విశాఖలో ఇప్పటికే భూకేటాయింపులు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించగా, ఈ సంస్థలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని లోకేశ్ సూచించారు. ఇటీవలి బెంగళూరు పర్యటనలో ఏఎన్ఎస్ఆర్, సత్వ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు ఎంఓయూలు కుదుర్చుకున్నాయని, వీటి ద్వారానే యువతకు 35,000 ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎంఓయూలు చేసుకున్న



సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ యూనిట్లు ఏర్పాటు చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే చిన్న సంస్థల కోసం 26 జిల్లా కేంద్రాల్లో కో-వర్కింగ్ స్పేస్‌లను సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

**త్వరలోనే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం**

రాష్ట్రంలో నవీన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ప్రోత్సాహానికి తలపెట్టిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. దీంతో పాటు విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను కూడా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సంబంధించి టీసీఎస్, ఎల్ అండ్ టీ, ఐబీఎంల భాగస్వామ్యంతో కంపెనీ ఏర్పాటైందని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టిసారించాలని అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 400 ఎకరాల్లో నిర్మించదలపెట్టిన డ్రోన్ సిటీని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన ఎకో సిస్టమ్ కల్పించాలని అధికారులను ఆదేశించారు. బుడమేరు వరదల సమయంలో డ్రోన్‌ల సేవలు ఎంతగానో ఉపకరించాయని, వ్యవసాయం, పోలీసింగ్, వాతావరణం

వివరాలు 2లో..

## సీమకు జలసిరులు... రేపు నీటిని విడుదల చేయనున్న చంద్రబాబు

- హంద్రీనీవా ఫేజ్-1 కాలువల సామర్థ్యం పెంపు
- శరవేగంగా పనులు పూర్తి
- 100 రోజుల్లోనే కాలువ విస్తరణ



**పెన్ పవర్ డెస్క్:**హంద్రీనీవా ఫేజ్-1 కాలువల సామర్థ్యం పెంపుతో రాయలసీమలో తాగు, సాగునీటి కష్టాలు తీరనున్నాయి. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే ఈ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి చరిత్ర సృష్టించింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న వేగవంతమైన నిర్ణయాలు, చూపిన చొరవ ఫలితంగా రాయలసీమకు జలసిరులు అందనున్నాయి. హంద్రీనీవా ఫేజ్-1 కాలువల విస్తరణ పనులు విజయవంతంగా పూర్తి కావడంతో సీమ జిల్లాలు సస్యశ్యామలం అయ్యేందుకు మార్గం సుగమం అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 17వ తేదీన నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తైన హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా వంద రోజుల్లోనే ఈ కాలువ విస్తరణ పనుల లక్ష్యాన్ని పూర్తి చేసింది.

**పరుగులు తీసిన ప్రాజెక్టు పనులు**

రూ.696 కోట్లతో చేపట్టిన ఈ విస్తరణ పనులతో హంద్రీనీవా ఫేజ్-1 కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరిగింది. రాయలసీమకు తాగు, సాగునీరు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫేజ్-1, ఫేజ్-2 కాలువ పనులను పరుగులు పెట్టించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి

వివరాలు 2లో..

## మిథున్ రెడ్డికి హైకోర్టులో షాక్

- ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో మిథున్ రెడ్డికి ఎదురుదెబ్బ
- ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టివేసిన హైకోర్టు
- సిట్ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా




**పెన్ పవర్ డెస్క్:**ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో మిథున్ రెడ్డి ఏ4గా ఉన్నారు.

వివరాలు 2లో..

## బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై జేసీ ప్రభాకర్ రెడ్డి ఫైర్

- పెద్దారెడ్డి పాదయాత్రలో జేసీపై సిద్ధార్థ రెడ్డి విమర్శలు
- నీలాంటి బచ్చా లీడర్లు చాలా మంది వచ్చిపోయారన్న జేసీ
- రాత్రిపూట కన్ను ఎగరేస్తే ఎలా ఉంటుందో నీకు తెలుస్తుందని వార్నింగ్



**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాదయాత్ర సందర్భంగా పెద్ద పప్పూరులో జేసీ ప్రభాకర్ రెడ్డిని ఉద్దేశించి సిద్ధార్థ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 2లో..

## రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని మాకైతే తెలియదు.. మీకు తెలుసా?

- వీరసావర్కర్‌కు వ్యతిరేకంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పిటిషన్
- తన పిటిషన్ రాహుల్ గాంధీ చదివేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును కోరిన పిటిషనర్
- రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు పెట్టేందుకు న్యాయపరమైన అవకాశం ఉందన్న హైకోర్టు



**పెన్ పవర్ డెస్క్:**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని మాకు తెలియదు, మీకేమైనా తెలుసా? అని పిటిషనర్‌ను బాంబే హైకోర్టు ప్రశ్నించింది. వీర సావర్కర్‌పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఒక వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. రాహుల్ గాంధీ తన పిటిషన్ కాపీని చదవాలనే ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ బాంబై హైకోర్టును కోరారు.

వివరాలు 2లో..

## ఆయుధాలు ఇస్తే నువ్వు నేరుగా మాస్కోపై దాడి చేయగలవా?

- ఇటీవల ట్రంప్-పుతిన్ మధ్య ఫోన్ కాల్ సంభాషణ
- ట్రంప్ ప్రతిపాదనకు నో చెప్పిన పుతిన్!
- అనంతరం జెలెన్ స్కీతో ట్రంప్ కీలక చర్చలు!

**పెన్ పవర్ డెస్క్:**ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటిదాకా శాంతి మంత్రం జపించిన ట్రంప్... ఇకపై రష్యాను ఒత్తిడిలోకి నెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్టు తాజా పరిణామాలు చెబుతున్నాయి.

వివరాలు 2లో..




జగన్‌ను కలిసిన కరేడు గ్రామ రైతులు...

## భూసేకరణను అడ్డుకోవాలని వినతి

- కరేడు భూముల్లో సోలార్ పరిశ్రమ
- ఇటీవలే భూసేకరణకు నోటిఫికేషన్ జారీ
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రైతులు



**పెన్ పవర్ డెస్క్:**నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో తమ సారవంతమైన భూములను ఇండోసోల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న రైతులు మంగళవారం నాడు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్‌ను కలిశారు. సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండే తమ సంట భూములను సోలార్ పరిశ్రమకు ఇవ్వకుండా నిలుపుదల చేయాలని కోరుతూ జగన్‌కు వినతిపత్రం అందజేశారు.రైతుల సమస్యలను సావధానంగా విన్న జగన్, అన్నదాతలకు వైసీపీ ఎప్పుడూ

వివరాలు 2లో..

## ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశం... హాజరైన టీడీపీ నాయకులు

- ఎన్నికల విధానాల్లో సంస్కరణ, ఓటరు జాబితాల్లో సంస్కరణలపై చర్చ
- అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిన ఈసీ
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఢిల్లీ వచ్చి సమావేశంలో పాల్గొన్న టీడీపీ బృందం

**పెన్ పవర్ డెస్క్:**సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధానాల్లో సంస్కరణలు,

వివరాలు 2లో..



## మల్లు భట్టివిక్రమార్కకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లీగల్ నోటీసులు

- రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై రామచందర్ రావుపై ఆరోపణలు
- తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ అధ్యక్షుడి డిమాండ్
- లేదంటే రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు లీగల్ నోటీసులు పంపించారు. రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై భట్టివిక్రమార్క చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయన

వివరాలు 2లో..



## శుభంగా భూమికి తిరిగొచ్చిన శుభాంశు శుక్లా కాలిఫోర్నియాలో స్పేస్ క్రాఫ్ట్ ల్యాండింగ్

- అంతరిక్షం నుంచి కాలిఫోర్నియాలో ల్యాండ్ అయిన శుభాంశు శుక్లా!
- శుభాంశుతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక
- 22 గంటల సుదీర్ఘ ప్రయాణం తర్వాత భూమిపైకి చేరిన నౌక
- ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు వ్యోమగాములు

**పెన్ పవర్ డెస్క్:**భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకున్నారు. వీరు అంతరిక్షంలో 18 రోజులు గడిపిన అనంతరం 22 గంటల సుదీర్ఘ ప్రయాణం చేసి భూమిపై దిగారు. కాలిఫోర్నియా సమీపంలోని సముద్రంలో నలుగురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక దిగింది. వారిని ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు వారు భూమిని చేరారు.జూన్ 25న అంతరిక్షంలోకి వెళ్లిన శుభాంశు బృందం అక్కడ పలు కీలక పరిశోధనలు నిర్వహించింది.



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఆధ్యాత్మికం: మౌనమే విజయానికి కీలకం...

సరిగ్గా మాట్లాడటం ఎంత కష్టమో, మౌనంగా ఉండటమూ అంతే కష్టం. అది మనసుకు సంబంధించిన భాష. వాక్కు అసలు పలకకపోవడం మౌనం కాదు. వాక్కును నియంత్రించడం మౌనం. అది ఒక యోగం, ఒక యాగం, సకలభాషలూ సమ్మిళితమైన విశ్వభాష. మౌనంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. మౌనం చాలా శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడుతుంది. మాటల ద్వారా సాధించలేనిది మౌనం ద్వారా సాధించవచ్చు మౌనంగా ఉండటం వల్ల ఎదుటివారి మాటలు, భావాలు బాగా వినడానికి, అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అన్ని వైపుల నుంచీ సమున్నతమైన భావాలను, ఆలోచనలను ఆత్మీయంగా ఆహ్వానించమంటుంది రుగ్వేదం. అలా చేయాలంటే మౌనాన్ని ఆచరించడం ఎంతో ముఖ్యమని చాణక్యుడు చెబుతున్నారు. అలా మౌనంగా ఉన్నవాడే ఎప్పుడూ ప్రశాంతతను పొందగలడని ఆయన అంటున్నారు. మౌనంలో ఎంతో మహత్తరశక్తి ఉంది. మాట్లాడటం వెండి అయితే.. మౌనం బంగారం అంటారు. మితంగా మాట్లాడటమూ మౌనమే అని చెబుతోంది మహాభారతం. హితంగా, మితంగా మాట్లాడలేకపోతే మౌనమే మేలని విదురనీతి ద్వారా తెలుస్తోంది. మౌనం మాట్లాడినంత తీయగా ... మరే భాషా మాట్లాడలేదు. మాటలకు అందని కమ్మని భావాలు మౌన భాషకు ఉంటాయి. విమర్శలు వచ్చినప్పుడు వెంటనే ప్రతిస్పందించకుండా మౌనంగా ఉండి, వారి మాటలు పూర్తిగా విని, ఆ తర్వాత ఆలోచించి సమాధానం ఇవ్వాలి. ఇది మిమ్మల్ని మరింత ప్రశాంతంగా, తెలివిగా కనిపించేలా చేస్తుంది.అవసరం లేని విషయాల్లో జోక్యం చేసుకోకుండా, మౌనంగా ఉండటం వలన అనవసర వివాదాలకు, గొడవలకి దూరంగా ఉండేందుకు మౌనం ఎంతగానో ఉపయోగపడుతుంది. మౌనం పట్ల విశ్వాసం, గౌరవం ఉన్నవాళ్లకే మౌనం విలువ తెలుస్తుంది. ఆదిశంకరులు, విద్యారణ్యస్వామి, రామకృష్ణ పరమహంస, రమణమహర్షి, శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి.. పలువురు ఆధ్యాత్మిక వేత్తలు, మహనీయుల సందేశాలు, ఉపదేశాలు సాధకులకు మౌనం ... మితంగా.. మాట్లాడడం వలన అంత శక్తిని సాధించారు.

మన సనాతన సంప్రదాయంలో మహానుభావులుగా చెప్పుకునే వారు ప్రబోధాలను, ప్రవచనాలను మౌనంగానే ఆలకించి, అవగాహన చేసుకుని హృదయాల్లో నిక్షిప్తం చేసుకున్నారు. అలాంటి వారందరికీ మౌనసాధనే ప్రధాన సాధనమైంది.

పాపపరిహారార్థం నిర్దేశితమైన అయిదు శాంతుల్లో మౌనం ఒకటని పురాణాలు చెబుతున్నాయి. అవి- 1.జపం 2.మౌనం 3.పశ్చాత్తాపం 4.శాంతి 5.దానం

మౌనంగా ఉండటం వలన ఆలోచించడానికి, విషయాలను విశ్లేషించడానికి తగిన సమయం దొరుకుతుంది. దీనివల్ల సరైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. మౌనంగా ఉండటం వలన ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది.అయితే, అవసరమైనప్పుడు ఎంతవరకు మాట్లాడాలో అంతవరకే మాట్లాడాలి. ఇతరులను బాధ పెట్టే విధంగా మాట్లాడటం.... పరుష వచనాలు పలకడం .... అబద్ధాలాడటం, చాడీలు చెప్పడం... అసంబద్ధంగా ప్రేలాపనలు చేయడం- ఈ నాలుగూ నోటినుంచి వచ్చే దోషాలని చెబుతారు. వీటన్నింటికీ పరిహారం మౌనం. మౌనవ్రతం వల్ల ఈ నాలుగు దోషాలూ దరి చేరవు. మౌనంగా ఉన్నప్పుడు మనసును ధ్యానానికి, వైరాగ్యానికి అంకితం చేసినట్లయితే వారి జీవితానికి చరితార్థత ఏర్పడుతుంది. భగవంతుడికి అత్యంత ప్రీతిపాత్రమైన భాష మౌనమే. మనిషి మనుగడకు జీవనయాత్రకు శబ్దం ఎలా చోదక శక్తి అయిందో మౌనమూ అంతే! వినయం, శ్రవణం మౌనానికి అనుసంధానమైనప్పుడు.. అది విన్నవారికి గ్రహించే శక్తి పెరుగుతుంది. పాండవుల పురోహితుడు ధౌమ్యుడు ఉపదేశించిన సేవాధర్మనీతిని.... పాండవులు మౌనంగా, శ్రద్ధగా ఆలకించారు. విదురనీతి అంతా ధృతరాష్ట్రుడు విన్నదే. ...విశ్వామిత్రుడి యాగసంరక్షణార్థం వెళ్లినప్పుడు రామలక్ష్మణులు మహర్షి ఉపదేశమంతా మౌనంగా వింటూ ఆయన్ని అనుసరించారు. శిష్యుడి అభ్యుదయానికి.. రాణించడానికి.. మౌనమే ఎంతో దోహదం చేస్తుందని అలాంటి వారి ద్వారా తెలుస్తోంది.వానాకాలంలో కప్పలు బెకబెకమని అరుస్తాయి. పంచమ స్వరంలో మధురంగా పలికే కోయిల తనకిది సమయం కాదని మౌనంగా ఉండిపోతుంది. అలాగే మూరు?ల సభలో పండితుడైనవాడు మౌనంగానే ఉండిపోతాడు. అక్కడ మౌనమే పరమభూషణం. పరిశోధనలో ప్రవచన్నాన్ని వినే సందర్భంలో విజ్ఞత గలవాడు మౌనంగానే ఉంటాడు. మౌనం అలజడిని అశాంతిని అణచివేస్తుందంటారు బాపూజీ. మౌనంగా చేసే ప్రార్థనకు ఎంతో శక్తి.. మహిమ ఉంటాయి. మౌనంగా ఉన్నప్పుడు చుట్టూ జరిగే విషయాలను, ఎదుటివారి అభిప్రాయాలను గమనించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ఇది కొత్త అవకాశాలను గుర్తించడానికి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంది. కొన్నిసార్లు మనం మాట్లాడకుండా మౌనంగా ఉండటం వలన మన శక్తిని కూడదీసుకోవచ్చు. ఇది ముఖ్యమైన విషయాలపై దృష్టి పెట్టడానికి, మరింత సమర్థవంతంగా పని చేయడానికి ఉపయోగపడుతుంది. మౌనం శ్వాసను తగ్గించి ఆయుష్షను పెంచుతుంది. మనిషికి మానసిక ఆరోగ్యం ప్రసాదిస్తుంది. ఆంతరిక శక్తిని వృద్ధిచేస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. యోగసూత్రాల్లో మౌనానికి ఇచ్చిన ప్రాధాన్యం ప్రశంసనీయమైనది. రజస్తమోగుణాలను తగ్గించి .. మౌనం సత్వగుణాన్ని పెంపొందింపజేస్తుంది. ముక్తికి ప్రధాన సోపానం మౌనమేనని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు.

# రూ. లక్ష కోట్ల పెట్టుబడులకు 95 సంస్థలు ముందుకువచ్చాయి

- మొదటి పేజీ తరువాయి

తదితర శాఖల్లో డ్రోన్‌ల వినియోగంపై నెలకు ఒక జిల్లాలో ఈవెంట్లు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.

మనమిత్ర సేవలు మరింత సులభతరం

పౌరసేవల్లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతపరచాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మొత్తం 702 సేవలలో 535 సేవలను ఇప్పటికే మనమిత్ర ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి చెక్ పెట్టాలని, కుల ధృవీకరణ పత్రంతో సహా విద్యాసంబంధిత అన్ని రకాల సర్టిఫికెట్లు బ్లాక్ చైన్‌తో అనుసంధానం చేసి మనమిత్ర ద్వారా సులభతరంగా పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రాష్ట్రంలోని 45,000 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి స్కూలుకు ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి వంటి ఎయిర్‌పోర్టుల్లో అంతరాయం లేని ఫోన్ కనెక్టివిటీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఐటీ అండ్ సీ స్పెషల్ సెక్రటరీ సుందర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ సాయికాంత్ వర్మ, ఆర్టీజీఎస్ సీఓ ప్రకార్ జైన్, ఏపీటీఎస్ ఎండీ సూర్యతేజ, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుధాలు ఇస్తే నువ్వు నేరుగా మాస్కోపై దాడి చేయగలవా?

- మొదటి పేజీ తరువాయి

జులై 4న ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీతో జరిగిన ఒక ప్రైవేట్ సంభాషణలో, అవసరమైన ఆయుధాలు అందిస్తే మాస్కో మరియు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లతో సహా రష్యా లోపల దాడులను తీవ్రతరం చేయగలరా? అని ట్రంప్ ప్రశ్నించినట్లు ఓ కథనం వచ్చింది.ఆ కథనం ప్రకారం... రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ట్రంప్ ఫోన్ కాల్ సంభాషణ తీవ్ర నిరాశాజనకంగా ముగిసిన తర్వాత జెలెన్ స్కీతో ఈ చర్చ జరిగింది. కాల్పుల విరమణ చర్చలకు రష్యా నిరాకరించడంపై అమెరికాలో పెరుగుతున్న అసంతృప్తిని ఇది సూచిస్తోంది. రష్యాను నేరుగా ఎదుర్కోవడానికి వెనుకడుగు వేస్తారన్న ట్రంప్ మునుపటి అభిప్రాయానికి ఇది భిన్నమైన వైఖరిగా భావిస్తున్నారు. రష్యన్లకు ఏదో విధంగా బాధ కలిగించి, వారిని చర్చలకు రప్పించడమే ట్రంప్ కొత్త వ్యూహమని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా దీర్ఘ శ్రేణి ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందిస్తుందా లేదా అనేది స్పష్టంగా తెలియకపోయినా, రష్యా భూభాగంపై మరింత దూకుడు దాడులకు పాశ్చాత్య దేశాలు, మరియు అమెరికా విధాన రూపకర్తలలో మద్దతు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు కొత్త ఆయుధాలను అందిస్తామని ట్రంప్ బహిరంగంగా ప్రకటించడం, అలాగే 50 రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యా ఎగుమతుల కొనుగోలుదారులపై ఆంక్షలు విధిస్తామని బెదిరించడం వంటి పరిణామాలు మాస్కో మొండి వైఖరి కారణంగానే చోటుచేసుకున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

# బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై జేసీ ప్రభాకర్ రెడ్డి ఫైర్

- మొదటి పేజీ తరువాయి

ఈ వ్యాఖ్యలపై జేసీ స్పందిస్తూ... నీలాంటి బచ్చా లీడర్లు ఎంతో మంది వచ్చి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. రప్పా రప్పా కాదు... రాత్రిపూట కన్ను ఎగరేస్తే ఎలా ఉంటుందో నీకు తెలుస్తుందని జేసీ వార్నింగ్ ఇచ్చారు. నువ్వు మాట్లాడే భాష మేం కూడా మాట్లాడగలం, నీకంటే ఎక్కువ బూతులు మాట్లాడగలమని చెప్పారు. కానీ, ఆ భాష తాము మాట్లాడితే ప్రజలు ఒప్పుకోరని అన్నారు. పొగరు తగ్గించుకుని మంచిగా ఉండాలని హితవు పలికారు. నీకు మంచి భవిష్యత్తు ఉంది, దాన్ని కాపాడుకో అని సూచించారు.

# శుభంగా భూమికి తిరిగొచ్చిన శుభాంశు శుక్లా కాలిఫోర్నియాలో స్పేస్ క్రాఫ్ట్ ల్యాండింగ్

- మొదటి పేజీ తరువాయి

ఈ 18 రోజుల్లో వీరు దాదాపు 96.5 లక్షల కిలోమీటర్లు ప్రయాణించారు. శుభాంశు శుక్లా 60కి పైగా శాస్త్రీయ పరిశోధనల్లో పాల్గొన్నారు. అంతరిక్షంలో ఉన్న సమయంలో ఈ బృందం 230 సూర్యోదయాలను చూసింది.

# మిథున్ రెడ్డికి హైకోర్టులో షాక్

- మొదటి పేజీ తరువాయి

మద్యం అమ్మకాల్లో పారదర్శకతను తగ్గించేందుకు ఆన్ లైన్ పేమెంట్ విధానాన్ని మాన్యువల్ మోడల్ గా మార్చడంలో మిథున్ రెడ్డిది కీలక పాత్ర అని సిట్ తరపు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. ముడుపులు ఇచ్చిన కంపెనీలకే మద్యం సరఫరా అనుమతులు ఇచ్చారని, దీని కారణంగా ప్రభుత్వ ఖజానాకు రూ. 3,500 కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పారు.

ఈ స్కామ్ లో మిథున్ రెడ్డి మాస్టర్ మైండ్ అని లూథ్రా కోర్టుకు తెలిపారు. ఎంపీ పదవిని దుర్వినియోగం చేశారని చెప్పారు. మిథున్ రెడ్డికి నేర చరిత్ర ఉందని... ఆయనపై ఇప్పటికే 8 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను కొట్టివేయాలని కోరారు.

మిథున్ రెడ్డి తరపున టి.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానంతో మిథున్ రెడ్డికి సంబంధం లేదని ఆయన కోర్టుకు తెలిపారు. షరతులతో కూడిన ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఇటీవలే ఈ వాదనలను విన్న హైకోర్టు ఈరోజుకు తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ ను కొట్టివేస్తూ ఈరోజు తీర్పును వెలువరించింది.

# జగన్‌ను కలిసిన కరేడు గ్రామ రైతులు... భూసేకరణను అడ్డుకోవాలని వినతి

- మొదటి పేజీ తరువాయి

అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి తరపున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, భూముల పరిరక్షణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ ఇచ్చిన హామీతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కరేడు గ్రామ రైతులు గత కొంతకాలంగా తమ భూములను ఇండోసోల్ పరిశ్రమకు కేటాయించడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వడంతో వారు భగ్గుమన్నారు. అప్పటినుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే వారు జగన్ ను కలిశారు. జగన్ ను కలిసిన సమయంలో రైతుల వెంట కందుకూరు అసెంబ్లీ స్థానం వైసీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడారు. “రెండు మూడు నెలలుగా ఈ భూముల గురించి రైతులు పోరాడుతున్నారు. ఏడాదికి రెండు పంటలు పండే భూములు వారి నుంచి లాక్కునే ప్రయత్నం జరుగుతుంది. రైతులు తమ గోడు జగన్ గారిని కలిసి చెప్పుకున్నారు. ఇండోసోల్ కంపెనీకి మా ప్రభుత్వ హయాంలో మరో చోట భూములు కేటాయించాం. కానీ మేం కేటాయించిన చోట కాకుండా, ఇండోసోల్ కంపెనీకి ఈ కూటమి ప్రభుత్వం కరేడు వద్ద భూములు కేటాయించింది. దీనిని మేం వ్యతిరేకిస్తాం అని జగన్ గారు చెప్పారు. ఇది అన్యాయమన్నారు. రైతులను ఇబ్బంది పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సారవంతమైన భూములు రైతులకే చెందాలి కానీ, ఇలాంటి భూములు ఇవ్వకూడదన్నారు. సాగుకు నిరుపయోగం అయిన భూములు ఇస్తే ఎలాంటి అభ్యంతరం లేదని జగన్ గారు చెప్పారు” అని వివరించారు.

# రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని మాకైతే తెలియదు.. మీకు తెలుసా?

- మొదటి పేజీ తరువాయి

అయితే, మీ పిటిషన్‌ను చదవమని రాహుల్ గాంధీని ఎలా బలవంతం చేస్తారని హైకోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించింది.

ప్రతిపక్షంలో ఉన్న రాహుల్ గాంధీ గందరగోళం సృష్టిస్తున్నారని, ఒకవేళ ఆయన ప్రధానమంత్రి అయితే విధ్వంసం సష్టిస్తారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు, ఆయన ప్రధాని అవుతారని మీకు తెలుసా అంటూ ప్రశ్నించింది.

అదే సమయంలో, రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు పెట్టేందుకు పిటిషనర్‌కు న్యాయపరమైన అవకాశం ఉందని పేర్కొంది. ఈ అంశంపై సావర్కర్ మనవడు పుణే కోర్టును ఆశ్రయించగా, అక్కడ దీనిపై విచారణ జరుగుతుందని న్యాయస్థానం గుర్తు చేసింది. దీనిపై సుప్రీంకోర్టులో కూడా విచారణ జరిగిందని, అక్కడ ఆ పిటిషన్‌ను కొట్టివేశారని తెలిపింది.

2022లో మహారాష్ట్రలో రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సావర్కర్ బ్రిటిష్ సేవకుడని ఆరోపించారు. బ్రిటిష్ నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో దుమారం రేపాయి. దీంతో సావర్కర్ మనవడు పుణే కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, విచారణ కొనసాగుతోంది.

# ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశం... హాజరైన టీడీపీ నాయకులు

- మొదటి పేజీ తరువాయి

ఓటరు జాబితా సవరణలపై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ఢిల్లీలో అఖిల పక్ష సమావేశం నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరపున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు యాదవ్, టీడీపీ ఎంపీలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ, ఓటరు జాబితాల్లోని లోపాలను సరిచేయాలన్న ఎన్నికల సంఘం లక్ష్యాన్ని స్వాగతించారు. కేంద్ర ఎన్నికల సంఘంపై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. ఓటరు గుర్తింపులో ఆధార్‌ను ఏకైక ఆధారంగా పరిగణించకూడదని సూచించిన టీడీపీ, 11 రకాల గుర్తింపు పత్రాలను అంగీకరించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని స్వాగతించింది.

### ఆధునిక సాంకేతికత వినియోగం, డూప్లికేట్ ఓట్ల తొలగింపు

డూప్లికేట్ ఓటర్లను తొలగించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని పల్లా శ్రీనివాస రావు సూచించారు. ప్రతి ఓటరుకు ప్రత్యేక డోర్ నంబర్ కేటాయించడం ద్వారా డేటా చోరీని నిరోధించి, యూనిక్ ఓటర్ ఐడెంటిటీని సృష్టించవచ్చని ఆయన పేర్కొన్నారు.

### పౌరసత్వ నిర్ధారణపై సుప్రీంకోర్టు తీర్పు ప్రస్తావన

ఓటరు జాబితా పరిశీలనలో ఎన్నికల సంఘానికి ప్రత్యేక హక్కులు ఉన్నప్పటికీ, పౌరసత్వ నిర్ధారణ వారి అధికార పరిధిలో లేదని, 1995 సుప్రీంకోర్టు లాల్ బాబు హుస్సేన్ కేసు తీర్పును ఆయన గుర్తు చేశారు. అభ్యంతరాలు లేవనెత్తిన వారే ఆధారాలు సమర్పించాలని, ఆధారాలు చూపలేకపోయినంత మాత్రాన ఓటర్ల హక్కును రద్దు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

### బీహార్‌లో తొలగింపు ప్రక్రియపై ఆందోళన

బీహార్‌లో ఓటర్ల తొలగింపు ప్రక్రియ కారణంగా గందరగోళం నెలకొందని, గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత తక్కువగా ఉండటం, ఆధార్ ఉన్నా ఇతర పత్రాలు లేని వారు ఎక్కువగా ఉండటం వల్ల నిజమైన ఓటర్లు తొలగింపుకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్‌లో సుమారు 3 కోట్ల మంది ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం ఆర్టికల్ 326కు విరుద్ధమని, గుర్తింపు పత్రాలు లేని వారు భారతీయులేనని నిర్ధారించే బాధ్యత ప్రభుత్వ సంస్థలదేనని ఆయన అన్నారు.

### టీడీపీ సిఫార్సులు...

టీడీపీ తరపున పల్లా శ్రీనివాస రావు, ఓటర్లకు అన్యాయం జరగకుండా న్యాయపరమైన, పారదర్శకమైన విధానాలను అమలు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

# సీమకు జలసిరులు... రేపు నీటిని విడుదల చేయనున్న చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

పనులను వేగవంతం చేశారు. ప్రస్తుతం ఫేజ్-1 కాలువ విస్తరణతో అదనంగా 1,600 క్యూసెక్కుల నీటిని తరలించే అవకాశం ఏర్పడింది. దీనితో జీడిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి సామర్థ్యంతో నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని ఆయకట్టుకు సాగునీరు, 33 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందనుంది.

### 12 ఏళ్ల తర్వాత 40 టీఎంసీల వినియోగం

మల్యాల నుంచి జీడిపల్లి వరకు 216 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు పూర్తి కావడంతో జీడిపల్లి, కృష్ణగిరి, పత్తికొండ, గాజులదిన్నె సహా రాయలసీమ జిల్లాల్లోని స్థానిక చెరువులను కూడా నీటితో నింపనున్నారు. దీంతో సీమ జిల్లాల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గతంలో హంద్రీనీవా ఫేజ్-1 కాలువ పూర్తి సామర్థ్యం 2,200 క్యూసెక్కులు మాత్రమే ఉండటంతో కేవలం 1-2 సార్లు మాత్రమే వరద సమయంలో 40 టీఎంసీల నీటిని వినియోగించుకున్నారు. ఇప్పుడు కాలువల సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరగడంతో, ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం మేరకు 40 టీఎంసీల వరద జలాలను ఈ ఏడాదిలో రాయలసీమ జిల్లాలకు వినియోగించుకునే అవకాశం కలిగింది. నెలకు దాదాపు 4.27 టీఎంసీల చొప్పున నాలుగు నెలల వరద కాలంలో అదనంగా 17.10 టీఎంసీల నీటిని తీసుకునే అవకాశం ఈ విస్తరణ పనుల ద్వారా ఏర్పడింది. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు కేటాయించిన 40 టీఎంసీల నీరు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల తాగు, సాగునీటి కష్టాలను తీర్చనుంది. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-1 ద్వారా నంద్యాల జిల్లాలో 2,906 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 77,094 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందనుంది. ఫేజ్-2 ప్రాజెక్టులో భాగంగా అనంతపురం జిల్లాలో మరో 2.27 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు నీరు అందనుంది. మొత్తంగా ఫేజ్-1, ఫేజ్-2 ద్వారా 6 లక్షల పైచిలుకు ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందనుంది.

### కూటమి ప్రభుత్వంతోనే మళ్లీ పనులు

2014-19 మధ్య రూ.4,317 కోట్లతో పాలనానుమతులు ఇచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువల విస్తరణ పనులను 47 శాతం మేర పూర్తి చేసింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి

వచ్చిన తర్వాత, 2025 ఏప్రిల్‌లో మొదలైన విస్తరణ పనులు కేవలం వంద రోజుల్లో పూర్తయ్యాయి. తదుపరి ఫేజ్-2 పనులను కూడా ఈ నెలాఖరుకు పూర్తి చేసి పుంగనూరు, కుప్పంలోని చివరి ఆయకట్టుకు కూడా నీరు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తం ప్రాజెక్టు కోసం రూ.3,890 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

ఈ ప్రాజెక్టు పూర్తి కావడంతో రాయలసీమలో తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమై, ప్రాంతం అభివృద్ధి పథంలో పయనించేందుకు ఇది ఒక ముందడుగు అని చెప్పవచ్చు.

# మల్లు భట్టివిక్రమార్కకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లీగల్ నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

తరపు న్యాయవాది విజయ్‌కాంత్ ద్వారా ఈ నోటీసులు పంపించారు.తనపై నిరాధార ఆరోపణలు చేసినందుకు మల్లు భట్టివిక్రమార్క మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. క్షమాపణ చెప్పని పక్షంలో క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా పేర్కొన్నారు.

# ఈకేవైసీ చేసుకోని రైతులు వెంటనే స్పందించండి

**వ్యవసాయ అధికారి చక్రధర్ విజ్ఞప్తి**




**రాజవొమ్మంగి, పెన్ పవర్, జూలై 15:** అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు లబ్ధి అందాలంటే, ఆధార్ సమర్పణ ప్రక్రియ (ఈకేవైసీ) తప్పనిసరిగా పూర్తవాలి. ప్రస్తుతం ఈ ప్రక్రియ పూర్తి చేయని రైతుల జాబితా సిద్ధంగా ఉందని వ్యవసాయ అధికారి చక్రధర్ తెలిపారు. ఈ జాబితాలో ఉన్నవారు తక్షణం స్పందించి, తమ గ్రామ సచివాలయంలో ఉన్న వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి, ఈకేవైసీ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. సహాయకుడు అందుబాటులో లేనిపక్షంలో, ఏవైనా సమస్యలు ఉంటే, తన మొబైల్ సంఖ్య 8331056487కు కాల్ చేయాలని తెలిపారు.రైతులు ప్రభుత్వం అందించే లబ్ధి నుంచి దూరం కాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, ఈ విషయాన్ని పరిసరాల్లోని ఇతరులకు తెలియజేయాలని కూడా ఆయన కోరారు. రైతుల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తూ, ప్రజలకు అవగాహన కల్పించడమే తన ధ్యేయమని వ్యవసాయ అధికారి తెలిపారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి

# తస్మాత్ జాగ్రత్త!

## కోడి వ్యర్థాలతో చేపల పోషణ



ప్రజా ఆరోగ్యానికి ముప్పుగా మారిన చెరువులు! | చేపల చెరువుల్లో కొట్టొచ్చిన వ్యర్థాలు | తలకిందులైన పల్లెవాసుల జీవితాలు

చేపల పులుసు, ఫ్రై పీస్ ఫిష్, బోన్ లెస్ ఫిష్...
వీటి పేరు వింటేనే నోరూరుతుంది కదు..
కానీ మీరు తినే ఆ చేపల రుచుల వెనుక దాగి ఉన్న విషపు కథ తెలిసినట్లయితే... మీకు వాంతులు అవ్వక మానవు.

ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలోని కైకరం పంచాయతీ శివారు గ్రామాల్లో చేపల చెరువుల్లో గత కొంత కాలంగా చేపలకు వేయాల్సిన దాణా కు బదులుగా కోడి వ్యర్థాలను (చికెన్ షాపులలో వేస్ట్ అదేనండి కోడి అవశేషాలు - కోడి తలలు, పేగులు, కుళ్ళిన మాంసం భాగాలు) బలవంతంగా మిక్స్ చేసి చేపలకు ఆహారంగా వేస్తున్న దారుణమైన వ్యవహారం వెలుగులోకి వచ్చింది.







పెన్ పవర్ EXCLUSIVE ప్రత్యేకం

**ఏలూరు/ ఉంగుటూరు, స్టేట్ బ్యూరో పెన్ పవర్ జులై 15:** ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం పంచాయతీ శివారు గ్రామమైన బ్రహ్మానందపురం మరియు వెంకటకృష్ణాపురం ప్రాంతాల్లో చేపల సాగు చేస్తున్నా విషయం తెలిసిందే. అయితే ఇటీవల స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కారణం - అక్కడి చెరువుల్లో చేపలకు methaku బదులు కోడి వ్యర్థాలను ఆహారంగా వేస్తున్న ఘటన.

**వివరాల్లోకి వెళితే...**

భలే కృష్ణం రాజు అనే వ్యక్తి (తండ్రి పేరు: సుబ్బారావు, స్వగ్రామం నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి, కైకరం పంచాయతీ పరిధిలోని సాయన్నపాలెం చివారు గ్రామంలో నాలుగు ఎకరాల చెరువును నిర్వహిస్తున్నాడు. ఇదే కాకుండా మనవాడు ఇంకా చాలా చేపల చెరువులు నిర్వహిస్తున్నాడు. అయితే, వ్యాపార లాభాల ఆశతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో చికెన్ షాపు లలో
వేస్ట్‌గా పారేసే అజీరోగ్య కోడి మాంసం మిగులు భాగాలు, అవశేషాలను బకెట్లల్లో నింపి లారీల్లో తీసుకొచ్చి చెరువుల్లో వేసి, చేపలకు ఆహారంగా వేస్తున్నట్టు విశ్వాసనీయ సమాచారం.

ఉంగుటూరు మండలం, కైకరం పంచాయతీ శివారు. ఇక్కడి చెరువుల్లో ఇటీవల రైతుల కళ్ళముందే చోటుచేసుకుంటున్న మార్పు.. ఇప్పుడు ఏ గ్రామస్తుని అడిగినా కలవరానికి గురిచేస్తోంది. వాస్తవానికి ఇది ఒక పల్లె వ్యధ. కానీ దీని ప్రభావం %–% మన జీర్ణాశయం వరకూ వస్తోంది.

**"పరిచయం అయిన చేపలు - తెలియని ప్రమాదాలు"**

భలే కృష్ణం రాజు అనే వ్యక్తి ౦ నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి చెందినవాడు. ఇటీవల కైకరం పంచాయతీ పరిధిలోని బ్రహ్మానందపురం, సాయన్నపాలెం శివారులో నాలుగు ఎకరాల చెరువును లీజుకు తీసుకుని చేపల సాగు చేస్తున్నాడు. మొదట్లో రైతులందరూ – "బాగానే వ్యాపారం చేస్తున్నాడు" అని భావించారు. కానీ ఇతని అసలు కథ ఈ మధ్యనే వెలుగులోకి రావడం తో ముక్కున వేలేసుకున్నారు.. అన్ని శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

> **గ్రామానికి చెందిన ఒక మహిళ మాటల్లో..**
> వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన లక్ష్మి అనే 58 ఏళ్ల మహిళ మాటల్లో "మనకు కావాల్సింది ఆరోగ్యం కానీ, ఇప్పుడు ఇక్కడి చేపలు తినగానే కడుపు బిగుసుకోడం మొదలవుతుంది" అంటోంది. ఆమె మాటల్లో మాధుర్యం లేదు.. కానీ వెదజల్లే భయం ఉంది.
>
> **"ఓ రైతు తప్పు చేస్తే- మరో పది రైతులు నష్టపోతారు!"**
> పక్కనే ఉన్న ఓ యువ రైతు మాటల్లో "ఒకచోట ఇలా తప్పుగా చేపలు పెంచితే.. అటూ మార్కెట్లో మన చేపలకీ ఎఫెక్ట్ వస్తుంది. ఎవ్వరూ తీసుకోరు. అది మన పాపం కాదు.. కానీ శాపం అవుతుంది!"

**"చేపలకు మేతకు బదులు.. కోడి వ్యర్థాలు!"**

చేపలకి సాధారణంగా ధాన్యపు చెకు, మొక్కజొన్న వంటివి ఆహారంగా వేయడం సహజం. కానీ ఇక్కడ వాణిజ్యమయమైన వ్యాపార లాభాల బాట మరొక దారి పట్టించింది. ఇక్కడితో ఆగకుండా విశాఖపట్నం, కాకినాడ వంటి నగరాల్లోని చికెన్ షాపుల నుండి వేస్ట్..అంటే కుళ్లిన మాంసం, తలలు, పేగులు, మేం మొదలైన వ్యర్థాలను ట్రాక్టర్లలో తెచ్చి చెరువులో వేస్తున్నారు. ఆ వాసనతో పక్కనున్న పంటలు కూడా ఎండిపోతాయేమో అన్నంత స్థితి. ఏర్పడిందని పరిసర ప్రాంతాల రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఆరోగ్య శాఖ, ఫుడ్ ఇన్స్పెక్టర్ ఏం చేస్తున్నారు?**

ప్రజలు మండల తహసిల్దార్, గ్రామ సర్పంచ్, మరియు స్థానిక ఆరోగ్య కార్యకర్తల దృష్టికి ఇది తీసుకెళ్లినా.. ఇంకా తగిన చర్యలు కనిపించడంలేదు. ఇది ఒక పల్లె సమస్య కాదు. ఇది ఫుడ్ చైన్‌లో భాగంగా ఉన్న అన్ని కుటుంబాలకు హెచ్చరిక.

**ఆరోగ్యానికి ముప్పు:**

ఈ విధంగా చేపలు తీసుకునే ప్రోటీన్ పూర్తిగా అనారోగ్యకరం కావడమే కాకుండా, మానవుల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. ఈ విధంగా తయారయ్యే చేపలను తినడం వల్ల జీర్ణకోశ సంబంధిత సమస్యలు, ఫుడ్ పాయిజనింగ్, లీవర్ మరియు స్కిన్ రోగాలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**రైతుల ఆందోళన**

ఈ చర్యలపై స్థానిక రైతులు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరు మండల వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ అధికారులు మరియు పోలీసులు సదరు దళారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



### ఆహారంగా కోడి వ్యర్థాలు... ఆరోగ్యానికి మాత్రం విషం!

పశు వైద్య నిపుణులు, ఫుడ్ సెఫ్టీ నిపుణులు ఏకగళంగా హెచ్చరిస్తున్న వ్యాపారులు మాత్రం తమ ధోరణి మార్చుకోవటం లేదు.

**1. బ్యాక్టీరియాల భయంకర ప్రభావం**

కోడి అవశేషాల్లో ఉండే సాల్మొనెల్లా బ్యాక్టీరియా, ఇకోలై బ్యాక్టీరియా , క్లస్ట్రిడియం వంటి బ్యాక్టీరియా తినే చేపల్లోకి చేరి, వాటిని తినే మనుషులకు ఆన్-సెట్ ఫుడ్ పాయిజనింగ్, వాంతులు, డైరీయా వంటి వ్యాధులు తెచ్చిపెడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**2. హెపటైటిస్ మరియు లివర్ డ్యామేజ్**

అశుద్ధమైన మాంసంతో పెరిగిన చేపలను తినడం వల్ల కొన్ని వైరస్‌లు మానవులకి లివర్ సంబంధిత వ్యాధులను కలిగించే ప్రమాదం ఉంటుందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**3. మాంసంలో టాక్సిన్ చేరిక**

మృదులజలచరాల్లో టాక్సిన్‌లు నిల్వ ఉండే లక్షణం ఉంటుంది. వీటిని తినే వ్యక్తుల శరీరంలో వాటి ప్రభావం దీర్ఘకాలంలో చూపిస్తుంది ౦ ఊబకాయం, హార్మోనల్. డిజార్డర్ , క్యాన్సర్ కూడా సంక్రమించే ప్రమాదాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.





ఆర్యవటం పీఏసీఎస్‌లో హట్టహాసంగా

# ప్రమాణ స్వీకారం

చైర్మన్ కోట తాతబ్బాయి, పాలకవర్గం సభ్యులు బాధ్యతల స్వీకరణ



**కాజులూరు, జూలై 15, పెన్ పవర్:** కాజులూరు మండల పరిధిలోని ఆర్యవటం గ్రామ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాల యంలో మంగళవారం నాడు చైర్మన్‌గా కోట తాతబ్బాయి గారు, పాలకవర్గ సభ్యులు తలాటం సత్తిరాజు, శాఖ పట్టాభిరామ య్యలు హట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. అర్చకుల సమక్షంలో మంత్రోచ్చారణల మధ్య బ్రాహ్మణుల ఆశీర్వాదాలతో, సొసైటీ సీఈవో ఆధ్వర్యంలో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించబడింది. అనంతరం నూతన బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ తాతబ్బాయి గారిని కూటమి నాయకులు, అధికారులు, తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా గజమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యాలయం ఎదుట బాణాసంచాలు కాలుస్తూ కార్యకర్తలు సందడి చేశారు. గ్రామంలో పండగ వాతావరణాన్ని తలపించేలా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సీఈఓ వెలగా రాంబాబు, సనపల ధనరాజు, టీడీపీ మండల అధ్యక్షులు చవ్వాకుల డాక్టర్ బాబు, జనసేన నాయకులు దేగల సతీష్, పేపకాయల బాబ్జి డి.సి., తాడి రామారెడ్డి, జక్కన రాజేష్, గొల్లపాలెం సొసైటీ అధ్యక్షులు అంగర కృష్ణ, అంగర శ్రీను, కొల్లి హనుమంతు చౌదరి, చుండ్రు రుద్రా చౌదరి, పెంకే అప్పారావు, ఏరు బండి నాని, సూరంపూడి భాను, క్లస్టర్ ఇంచార్జ్ సలాది సాయిబాబు, మాజీ సర్పంచ్ వనం వీరబ్రహ్మం, రెడ్డి శేషారావు, గ్రామ కమిటీ అధ్యక్షులు కురుపూడి దొరబాబు, గీసాల సతీష్ (బీసీ సెల్ ఉపాధ్యక్షుడు), గీసాల రాజు, చందాల ఆదినారాయణ, దేగల బాబులు, గోవిందరెడ్డి, శలపాక మాధవరపు దొరబాబు, దేగల దొరబాబు, తణుకువాడ సొసైటీ అధ్యక్షుడు పితాని సతీష్ కుమార్, వల్లు అర్జున్ రావు, వడ్లపాటి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి కే.సూరిబాబు,వీఆర్వో రాయుడు,వేలాది శ్రీనివాస్, పంచాయతీ మరియు సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి శ్రద్ధ తీసుకుంటానని, రైతుల సంక్షేమమే తన లక్ష్యమని కోట తాతబ్బాయి గారు ఈ సందర్భంగా తెలిపారు. కొత్త పాలకవర్గంతో గ్రామ రైతులకు నూతన ఆవేశం నింపే విధంగా కార్యాచరణ కొనసాగనుంది.

# సబ్ స్టేషన్ లో ట్రాన్స్ఫార్మర్‌ను ప్రారంభించిన రాజోలు ఎమ్మెల్యే



**అమలాపురం/రాజోలు పెన్ పవర్ రీలై 15:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు మండలం, రాజోలు విద్యుత్ సబ్ స్టేషన్‌లో కోటి 14 లక్షల రూపాయల వ్యయము తో ఏర్పాటు చేసిన 8 ఎంవిఎ పవర్ ట్రాన్స్ఫా ర్మర్ను రాజోలు నియో జకవర్గ శాసన సభ్యులు దేవ వరప్రసాద్ నేడు ప్రారం భించారు. శాసన సభ్యులు మాట్లా డుతూ రాజోలులో విద్యుత్ విని యోగం అధికంగా పెరిగిందని, దానికి తగిన సప్లై లేకపోవడం వలనలో ఓల్టేజ్ సమస్య అధికం అవుతుందని అన్నారు. నేను ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నానని, సబ్ స్టేషన్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నానని తెలిపారు. దానిలో భాగంగానే గుడి మూలలో సబ్ స్టేషన్ ప్రారంభా నికి సిద్ధంగా ఉందని, అదే విధంగా గుడి మెల్లంక, శంకగుప్తం గ్రామాల్లో సబ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తు న్నామని తెలిపారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉంటేనే పూర్తిస్థాయిలో మంచి నీటి సరఫరా సాధ్యమవుతుందని అన్నారు. అందుచేత విద్యుత్ సరఫరా కోసం పూర్తి స్థాయిలో ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు, మరిన్ని సబ్ స్టేషన్లు రాజోలు నియోజకవర్గం రావడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్య క్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ జి శ్రీనివాసు, దిరిశాల బాలాజీ, ఉలిశెట్టి లక్ష్మణ్ రావు, శ్రీను, విద్యుత్ అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్ డే



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 15:** వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలకు రోల్ ప్లే , క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు, ఈ వేడుకల్లో పి. స్కూలు ఎస్.ఎం.సి. చైర్మన్ త్రిమూర్తులు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి రాం, జూనియర్ కాలేజీ ఇంచార్జ్ ఫణి కుమార్ ముగ్గురు ఒకేషనల్ ట్రైనర్స్ స్టీఫెన్ (ఎలక్ట్రానిక్స్), తేజస్విని, వివేక్ (ఆటోమోటివ్) వారి ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ నైపుణ్యాలను అందిపుచ్చుకునే దిశగా పిల్లలకు సూచనలు చేశారు.. అనంతరం ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్ తో పాటు బహుమతులు ప్రధానం చేశారు..

## అనారోగ్యం తో బాధపడుతున్న చిన్ననాటి స్నేహితులకు ఆర్థిక సాయం



అంబాజీపేట, పెన్ పవర్, జూలై 15: చిన్నాటి పాఠశాల మిత్రుల కలయిక మరుపురానిదని వారి మర్చిపోకుండా మంచి, చెడులలో మేమున్నామంటూ చేయూతను అందించిన మిత్రబృం దం.. ఇటీవల ద్విచక్రవాహన ప్రమా దంలో గాయపడిన తమతో చదువు కున్న ఇద్దరు మిత్రులకు పూర్వ విద్యా ర్థులు ఆర్థిక సాయం అందచేసారు. మండలంలోని నందంపూడి,మాచవరం గ్రామాలకు చెందిన మోక రమేష్, షేక్ సుల్తాన్ లు జీవనోపాధి నిమిత్తం ఏలూరు జిల్లా కు వెళ్లారు అక్కడ పని ముగించుకొని వాళ్ల స్వగ్రామం కు తిరిగి వచ్చే క్రమంలో దెందులూరు హైవే పై వారు వస్తున్న బైక్ ను కారు బలంగా ఢీకొనడంతో వీరువురు తీవ్రంగా గాయపడ్డారు ...లేవలేని స్థితిలో ఉన్నారు. అంబాజీపేట జడ్పీ హైస్కూల్ లో 2002-03 సం.రంలో పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న అందరి సహకారంతో ఇరువురికి 1లక్షా50వేల రూపాయలను వారికు అందచేసారు. ఈ కార్యక్రమంలో జయను రాదా కృష్ణ, బండారు నాగమణి, అంకం భారతి, కేత సతీష్, విజయ్, వలి, బాలు, శ్రీను, సుధాకర్ పాల్గొన్నారు.

## సొసైటీ అధ్యక్షులు కుక్కల రామారావుకు అభినందనలు



**మండపేట.పెన్ పవర్. జూలై 15 :** మండపేట శ్రీ వల్లూరి అప్పారావు ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా రెండోసారి ఎన్నికైన కుక్కల రామారావు ను పలువురు అభినందించారు.మండపేట బిసి ఎస్సీ,ఎస్టీ మైనారిటీ సంఘ సభ్యులు ఆయన్ని సత్కరించారు.బిసిలను గుర్తించి నామినేటెడ్ పోస్టు ను రామారావుకి ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం బిసి,ఎస్సీ,ఎస్టీ మైనారిటీలను రాజ్యాధికారంలో కూడా భాగస్వాములు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిసి నాయకులు కోన సత్యనారాయణ,బిసి ఎస్టీ మైనారిటీ సంఘ అధ్యక్షులు దూలి జయరాజు,సెక్రటరీ వీరమల్లు శ్రీనివాసు, మైనారిటీ నాయకులు షరీఫ్,టిడిపి సీనియర్ నాయకులు జొన్నపల్లి సూర్యారావు,మందపల్లి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల మండలం

### ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా బూర్లె హరిబాబు



**అడ్డతీగల, పెన్ పవర్, జూలై 15:** తెలుగుదేశం సీనియర్ నాయకుడు బూర్లె.హరిబాబు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి, ఈయన ఇప్పటివరకు అరకు పార్లమెంటరీ సమన్వయ కమిటీ మెంబర్గా మరియు రంపచోడవరం నియోజవర్గం ఫైవ్ మాన్ కమిటీ మెంబర్ గా పార్టీకి ఎంతో కృషి చేశారు .ఆయన కృషికి తెలుగుదేశం పార్టీ గుర్తించి ఆయనకి ఈ పదవి ఇవ్వడం జరిగింది. ఈ పదవి రావడానికి తోడ్పడిన రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల. శిరీష దేవి మరియు తెలుగు యువత అధ్యక్షులు మఠం.విజయభాస్కర్ కు నూతన చైర్మన్‌గా ఎన్నికైన హరిబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన చైర్మన్ గా ఎన్నికైన హరిబాబు కు అడ్డతీగల మండల కూటమి నాయకులు ఈ సందర్భంగా హరి బాబును అభినందించారు. వీరిలో తెలుగుదేశం నాయకులు ఎడ్ల. శ్రీనివాస్, క్లస్టర్ ఇంచార్జ్ గుంజిగడ్డ. ఏసు, అడ్డతీగల ప్రభుత్వం కాలేజీ చైర్మన్ చెక్క.వీరలక్ష్మి,వీరారెడ్డి, వేగిరాజు, నాగేశ్వరావు అడ్డతీల మండలం జనసేన పార్టీ నాయకులు కుప్పాల. జయరాం, పొడుగు. సాయి,అప్పాజీ,వెంకటేష్,వెంకన్న, దాదా మరియు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## భట్నవిల్లి సొసైటీ అధ్యక్షులుగా నామాడి ప్రమాణ స్వీకారం



**అమలాపురం పెన్ పవర్ జూలై 15:** రూరల్ మండలం భట్నవిల్లి సొసైటీ అధ్యక్షులుగా నామాడి వెంకట్రావు మంగళవారం ప్రమాణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా అమలాపురం శాసనసభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నామాడి వెంకట్రావు కు ఎమ్మెల్యే ఆనందరావు శుభాకాంక్షలు తెలియజేసారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికీ పార్టీ ఎప్పుడు అండగా నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు,ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ జడ్పీటీసీ అధికారి జయ వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు,దంతులూరి వాసురాజు,మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 15:** స్థానిక పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో జగ్గంపేట జనసేన ఇంచార్జ్ మరియు తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని జగ్గంపేట నియోజకవర్గం జనసేన నాయకులు హాజరై క్యాంటీన్ ను ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ మా నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ క్యాంటీన్ గత సార్వత్రిక ఎన్నికల అనంతరం నుంచి నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరావు, గంధం శ్రీను, సత్తి సోమరాజు, అంకం ఓం, శ్రీమన్నారాయణ, డ్రిల్ మాస్టర్, పులిప్రసాద్, శివరామకృష్ణ, మిరియాల రాజు, పార్సి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ వేంకటేశ్వర సహిత ఐశ్వర్య లక్ష్మి హెూమం

### ఆలయ ప్రాంగణం అర్చనలు, వేదఘోషలతో మార్మోగిన దివ్య దృశ్యం



**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 15**

ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామం వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వేంకటేశ్వర సహిత ఐశ్వర్య లక్ష్మి హెూమం అత్యంత భక్తి భరితంగా, వైభవోపేతంగా నిర్వహించబడింది. స్వామివారి సన్నిధిలో జరిగిన ఈ పవిత్ర కార్యం భక్తుల హృదయాలను భక్తి భావాలతో నింపింది. వేద మంత్రోచ్ఛాంణల మధ్య యజ్ఞగుండం నుండి వెలసిన పవిత్ర ధూమపానాలు, భక్తుల మనస్సుల్లో ఆధ్యాత్మిక వెలుగు నింపాయి.

**అష్టోత్తర నామార్చన-స్వామివారి శరణు**

భగవంతుని అష్టోత్తర నామాలతో ఆలయం మార్మోగింది. భక్తులు ఒక్కొక్క నామాన్ని ఉచ్చరించేటప్పుడల్లా,వారి హృదయాలలో ఆ నామాల అర్థం పుష్పంలా వికసించినట్లు అనిపించింది. దైవ స్మరణతో అంతటా ఒక పవిత్ర శాంతి పరచింది.

**నిత్య కల్యాణం - అనుగ్రహసౌభాగ్యం**

అనంత సౌభాగ్యానికి, శుభ మంగళానికి ప్రతీకగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కల్యాణోత్సవం కూడా నిర్వహించబడింది. “ఈ దివ్య దృశ్యం మన కళ్లతెరపై అలా నిలిచిపోయింది” అని పలువురు భక్తులు భావోద్వేగంగా పేర్కొన్నారు.

**అన్నదానం -ఆధ్యాత్మిక తృప్తి:** ఆలయ అన్నదాన భవనంలో జరిగిన అన్న ప్రసాద వితరణ విశేష ఆకర్షణగా నిలిచింది. స్వామివారి ప్రసాదాన్ని గ్రహించేందుకు భక్తులు శ్రద్ధగా, శాంతిగా నిలుచుని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది పాల్గొని భౌతిక ఆకలిని పోగొట్టడంతో పాటు, భక్తి రుచిని ఆస్వాదించారు.

## గర్ల్స్ హైస్కూల్లో బాల్య వివాహాలపై అవగాహన



**అమలాపురం పెన్ పవర్ జూలై 15 :** ముమ్మిడివరంలోని గర్ల్స్ హై స్కూల్‌లో మంగళవారం బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అలర్ట్ ఎన్జీవో ఆధ్వర్యంలో ముమ్మిడివరం గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్‌లో బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం బాలికలకు బాల్యవివాహాల వల్ల కలిగే హానికరమైన ప్రభావాలను వివరించడం, వారికి చట్టపరమైన రక్షణల గురించి అవగాహన కల్పించడమే. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ పరిమళ అధ్యక్షత వహించారు. ఆమె బాలికలు చదువు ద్వారా శక్తివంతంగా మారాలని, బాల్యవివాహాలపై అవగాహన తప్పనిసరిగా అవసరమని వివరించారు. జిల్లా కోఆర్డినేటర్ బి. నాగార్జున, విద్యార్థుల్ని ఉద్దేశించి మాటాడుతూ బాల్యవివాహాల వల్ల బాలికల విద్యా జీవితం దెబ్బతింటుందని, తొందరలో గర్భధారణ, ఆరోగ్య సమస్యలు వంటి భవిష్యత్ సమస్యలకు దారితీస్తుందని స్పష్టం చేశారు.ఫీల్డ్ కోఆర్డినేటర్ కె.వెంకటేశ్వరరావు చట్టం (పోక్సో చట్టం – పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం) గురించి వివరించారు. ఈ చట్టం ద్వారా బాలలు ఎలాంటి లైంగిక వేధింపులనుండి రక్షణ పొందతారో తెలియజేశారు. ప్రమాదంలో ఉన్న వారు నిశ్చయంగా సహాయం పొందగలరని, నిర్భయంగా ముందుకు రావాలని చెప్పారు.కార్యక్రమం సజీవంగా సాగింది. విద్యార్థినులు చురుకుగా పాల్గొని ప్రశ్నలు అడిగి, తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అవగాహన పెంచే లెఫ్లెట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థినులు “బాల్యవివాహాలకు వ్యతిరేకంగా మన గొంతు వినిపిద్దాం–మన హక్కుల కోసం నిలదిద్దాం” అనే ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల సిబ్బంది, అలర్ట్ ఎన్జీవో ప్రతినిధులు,ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తామని తెలిపారు.

## వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శించుకున్న బీజేపీ జాతీయ నాయకుడు పురిఘళ్ల రఘురామ్





**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 15:** బీజేపీ జాతీయ నాయకుడు పురిఘళ్ల రఘురామ్ మంగళవారం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ చరిత్ర, విశిష్టతలను వివరిస్తూ దేవస్థాన వివరాలు వెల్లడించారు. పురిఘళ్ల రఘురామ్‌తో పాటు రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ, అసెంబ్లీ కో కన్వీనర్ కోటిపల్లి దామోదర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దంశెట్టి శ్రీనివాసరావు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఫోనుగుపాటి శ్రీనివాస్, మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, వి. కిరణ్, బొర్రా ఆంజనేయులు, మంగేనా సురేష్ తదితరులు ఆయనతో ఉన్నారు.

ఆలయ సందర్శన అనంతరం బీజేపీ నాయకులు స్థానిక నేతలతో సమావేశమై పార్టీ కార్యకలాపాలపై చర్చించారు. ప్రజలతో సన్నిహితంగా ఉండి పార్టీని బలోపేతం చేయాలని ఈ సందర్భంగా రఘురామ్ పిలుపునిచ్చారు.

# రంపచోడవరం మండలంలో ఆధార్ సేవల కొరత

- వృద్ధులు,మహిళలు,చిన్నారులు రోడ్డులపై తల్లడిల్లే పరిస్థితి..
- ప్రధాన కేంద్రంలో సిబ్బంది గైర్హాజరు-ప్రజలకు ఇబ్బందులు...
- దూరప్రాంత గిరిజనుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి....
- ప్రతి సచివాలయంలో ఆధార్ సేవల కేంద్రాలు ఏర్పాటు చేయాలి...
- రాపాక సుధీర్ డిమాండ్..



**దేవీపట్నం/రంపచోడవరం,పెన్ పవర్,జూలై15:** రంపచోడవరం మండలం లోని సచివాలయాలలో కొత్త ఆధార్ కార్డులు జారీ చేయడం,అలాగే ఆధార్ వివరాల్లో మార్పులు,చేర్పులు చేసేందుకు ఎలాంటి సదుపాయం లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు రాపాక సుధీర్ రాజ్ (సిద్దు) తెలిపారు.ప్రస్తుతం ఆధార్ సంబంధిత సేవల కోసం గిరిజనులు రంపచోడవరం ప్రధాన కేంద్రంలోని ఆధార్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని,అయితే అక్కడ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాకపోవడం వల్ల గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులు,మహిళలు,చిన్నపిల్లలు అనవసరంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వారాల తరబడి సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా తమ పని జరగడం లేదని వాపోతున్న ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రతి సచివాలయంలో ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రత్యేకించి దూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులకు తక్షణమే సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు.

### విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్య విధానంపై

# అవగాహన

### ఎంపీఎస్‌లో క్యాబినెట్ ఎన్నికలు



మండపేట. పెన్ పవర్.జూలై 15: మండపేట పబ్లిక్ స్కూల్ లో క్యాబినెట్ ఎన్నికలు జరిగాయి. ప్రజా స్వామ్య దేశంలో ఎన్నికలు జరిగే విధానంపై విద్యార్థి దశ నుండే అవగాహన కల్పిస్తున్న ఎంపీఎస్ యాజమాన్యం అభినందనీయులని మండపేట మండల విద్యా శాఖాధికారులు నాయుడు రామచంద్రరావు, చింతా వెంకట సోమిరెడ్డిలు అన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల తరహాలో స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో విజేతలకు అభినందనలు తెలిపారు. ఇప్పటి నుండే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపీఎస్ విద్యా సంస్థల అధినేత వల్లూరి చిన్నారావు మాట్లాడుతూ ఎందరో మహా నాయకులు పాఠశాల స్థాయిలోనే నైపుణ్యాన్ని అందిపుచ్చుకుని నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్నారన్నారు. ప్రజాస్వామ్యం పట్ల ప్రస్తుత యువతకు నమ్మకం తగ్గుతున్న తరుణంలో విద్యార్థి దశలోనే భాంతదేశ వజ్రాయుధమైన ఎన్నికల ప్రక్రియను అలవర్చాల్సిన బాధ్యత పాఠశాలలపై ఉందన్నారు. ఆ ఉద్దేశ్యంతోనే విద్యావ్యవస్థలో విద్యార్థి నాయకత్వ లక్షణాలను అలవర్చేందుకు మండపేట పబ్లిక్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రతీ ఏడాది కేబినెట్ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల విధానంపై పూర్తిస్థాయి అవగాహన కలిగే విధంగా నామినేషన్ ప్రక్రియ, నామినేషన్ విత్ డ్రా, స్క్రూటినీ, ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ప్రకటన, అనంతరం జరిగే ఎన్నికలు, ఓట్ల లెక్కింపు, విజేతల ప్రకటన తదితర అన్ని విషయాలపై విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించారు. ఇలాంటి ఎన్ని కల వల్ల విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, పోటీతత్వం పెరుగుతాయని ఉత్తమపౌరులుగా రూపుదిద్దుకోవడానికి ఉపకరిస్తుందని తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందిన హెడ్‌బాయ్ వల్లూరి అర్జున్ నంద, హెడ్ గర్ల్ టేకి బిందు లక్ష్మి , డిప్యూటీ హెడ్ బాయ్ అగర్తి మాధవ్, డిప్యూటీ హెడ్ గర్ల్ గుణ్ణం నేహా శాన్వి చౌదరి, హౌస్ కెప్టెన్స్ కొప్పిశెట్టి హర్షిత్, కొర్లపాటి శ్రీ మోక్షిత, గోవిందరాజుల శిశిర, మగ్గం రేవంత్ శ్రీ సాయి తేజ, హౌస్ వైస్ కెప్టెన్స్ మాసాబత్తుల అభిలాష్, ఖండవల్లి హర్ష సత్య జనార్ధన్, ఎలి ప్రేమ్ జోయల్, వాసంశెట్టి అమూల్యలకు బ్యాడ్జీలు, ఫ్లాష్ను అందజేసి వారిచేత ప్రమాణస్వీకారం చేయించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### కారుణ్య నియామక పత్రాలు అందజేసిన

## జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జులై 15:** నగరపాలక సంస్థ కార్యాలయం నందు పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల వారసులు ముగ్గురికి కారుణ్య నియామకాల పత్రాలు ఇస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముగ్గురిలో ఇద్దరికి జూనియర్ అసిస్టెంట్, ఒకరికి పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా కారుణ్య నియామక పత్రాలు ఇవ్వటం జరిగిందన్నారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు క్రమశిక్షణతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. సీనియర్ల వద్ద పని మెళుకువలు నేర్చుకుని సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. అదేవిధంగా అంకితభావంతో అప్పగించిన విధులు నిర్వర్తించి, తాము పనిచేస్తున్న శాఖల అధికారుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో అడిషినల్ కమీషనర్ పి.వి. రామలింగేశ్వర్, ఆఫీస్ మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

## స్టేట్ ర్యాంక్ సాధించిన పేద విద్యార్థికి ఆర్థిక సాయం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 15:** ఏయు సెట్ లో స్టేట్ 14వ ర్యాంక్ సాధించిన జగ్గంపేటకు చెందిన కణితి సోమశేఖర్ కు శ్రీ కరుటూరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యా ప్రోత్సాహం కింద ఆర్థిక సాయం చేశారు. ఈ సాయాన్ని మాజీ మంత్రి, వైసీపీ జగ్గంపేట నియోజకవర్గం ఇంచార్జ్ తోట నరసింహం చేతుల మీదుగా విద్యార్థి సోమ శేఖర్ కు రూ.10వేలు అందించారు. బాగా చదువుకుని మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువనేత తోట శ్రీరాంజీ, ఒమ్మి రఘురామ్, కరుటూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ పేరుతో నాటే మొక్కకి రోజు నీరు పోసి ప్రాణం పోద్దాం

### ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై15:** భారత ప్రభుత్వం మై భారత్ కాకినాడ జిల్లా వారి సహకారంతో మణికర్ణిక యువజన సంఘం ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు భారతదేశం అంతా తల్లి పేరు మీద మొక్క నాటే కార్యక్రమం జరుగుతుందని ఆంధ్ర ప్రదేశ్ లో వినూత్నంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. యువత అంత అమ్మ మీద చూపించే ప్రేమ ఈ మొక్క మీద చూపించాలని, భవిష్యత్తు తరాలకు కలుషితం లేని పర్యావరణాన్ని అందించాలని అన్నారు. టీం మణికర్ణిక నిస్వార్థంగా చేసే సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని మన జిల్లాలో మన నియోజక వర్గంలో జరగడం హర్షనీయం అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని విద్యార్థులు అంతా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయ్యాలని కోరారు. మణికర్ణిక యువజన సంఘ అధ్యక్షురాలు గున్నాబత్తుల పూజా అనూష మాట్లాడుతూ సృష్టికి మూలం అమ్మ పర్యావరణ పరిరక్షణ కూడా అమ్మతోనే సాధ్యం అని అమ్మ మీద ప్రేమ తో మనం వేసే మొక్కకి రోజు నీరు పోసి ప్రాణం పోద్దాం అని అన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ మీద పెట్టిన వ్యాసారచన పోటీలలో విజేతలకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్, మేమేంటోను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అందించారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ ఏవిఎస్ చంద్రశేఖర్, టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, టీం మణికర్ణిక ఉప అధ్యక్షులు శ్రీనివాస్, టీం సభ్యులు వీరబాబు, చిక్కాల మణికంత, రమేష్, స్వామి, నాని, మణికంత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా బూరయ్య



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 15:** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పిఏసిఎస్) అధ్యక్షునిగా సూతి బూరయ్య ను టిడిపి అధిష్టానం ఎంపిక చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి తిరుమాలి గ్రామానికి చెందిన ఏలేశ్వరం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సూతి బూరయ్యను పిఏసిఎస్ అధ్యక్షుడిగా, సభ్యులుగా వైభోగల సుబ్బారావు కొప్పిశెట్టి సూరిబాబులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమిలో మూడు పార్టీలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ నూతన పాలక వర్గ సభ్యులు ఎంపిక చేయడం జరిగింది అని అన్నారు. నూతన పాలక వర్గ సభ్యులు అందరికీ ఎమ్మెల్యే అభినందించారు.

## స్వామి దయానంద సరస్వతి ఆశ్రమానికి మద్దుల స్వరూప్ ఆర్థిక సహాయం



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 15:** స్థానిక వారిపేట ఏరియాలో ఉన్న స్వామి దయానంద సరస్వతి ఆశ్రమా నికి మద్దుల స్వరూప్ మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక హెల్పింగ్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో మద్దుల స్వరూప్ కుమారుడు రుత్విక్ మొదటి పుట్టినరోజు సందర్భంగా అందించిన ఆర్థిక సహాయంతో హెల్పింగ్ యూత్ సభ్యులు సీలింగ్ ఫ్యాన్, కుక్కర్, 10 చాపలు విద్యార్థులకు అవసరమయ్యే మరికొన్ని వస్తువులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వంకాయల వెంకటశెట్టి, దంగేటి మురళీకృష్ణ, హెల్పింగ్ యూత్ సభ్యులు, రాంలాల్, ఎస్.కె అలీషా, ఎదుర్ల అప్పాజీ, ఎస్ కే అలీషా తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు పూర్తి భాగస్వామ్యం వహించాలి

### కలెక్టర్ మహేష్ కుమార్





**అమలాపురం పెన్ పవర్ జూలై 15:** ఆయకట్టులో స్థిరీకరించ బడిన ప్రతి ఎకరాకు సాగు నీరు సకాలంలో అందించే దిశగా జల వనరులు వ్యవసాయ రెవెన్యూ అధికారులు పూర్తి భాగస్వామ్యం వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం రెవెన్యూ, వ్యవసాయ జల వనరుల శాఖ అధికారుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సాగునీటి సరఫరా స్థితిగతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో సాగునీరు సకాలంలో కాలువ చిట్ట చివరి ఆయకట్టు భూములకు చేరడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై అధికారులు వెంటనే స్పందించి తగు పరిష్కార మార్గాలు సూచించాలని ఆదేశించారు. పంట కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయడం లేదని, కాలువ చివరి ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు ఇక్కట్లు పడుతున్నట్లు ప్రతికూల వార్తలు ప్రచురితమవుతున్నాయని, వీటిపై అధికా రులు దృష్టి పెట్టి పరిష్కారానికి చర్యలు గైకొనాలన్నారు.. జల వనరుల శాఖ సహాయ ఇంజనీర్, మండల వ్యవసాయ అధికారి సంబంధిత తాహాసిల్దార్ బృందం కాలువలు వెంబడి తనిఖీలు నిర్వహించి, ఎక్కడ ఎక్కడ ఆక్రమణలు ఉన్నాయో గుర్తించడంతో పాటు సాగునీరు సవ్యంగా ఎందుకు పారడం లేదు, కారణాలను అన్వేషించి పరిష్కార దిశగా చర్యలు గై కొనాలని ఆదేశించారు. కాలువలను పూడికచేత పనులకు సంబంధించి గతంలోననే ప్రతిపాదనలు సమర్పించి ఉన్నట్లయితే మరల రీజైండర్లు సమర్పించాలని ఆదేశించారు.. పై స్థాయి నుంచి క్రింది స్థాయి వరకు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ప్రకారం నీటి విడుదల జరుగుతుందని, కొన్ని కారణాలవల్ల కాలువలలో సాగునీరు కొన్నిచోట్ల కాలువ మధ్యలో భూములను ముంచేస్తుందని, ఈ యొక్క అడ్డంకులను గుర్తించి సవ్యంగా పారేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. డ్రైనేజీలలో పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించి క్లీనింగ్ కు చర్యలు చేపట్టాలని డ్రైనేజీ ఇంజ నీర్లను ఆదేశించారు. కాలువలలో సాగునీటి ప్రవాహాలను నిర్దేశత స్థాయిలలో నిర్వహిస్తూ సమృద్ధిగా సాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు జలవనరులు ఇంజనీర్లు డ్రైనేజీ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల వద్ద గుట్కా విక్రయిస్తే చర్యలు తప్పవు

### - జడ్డంగి ఎస్ఐ



**రాజవొమ్మంగి, పెన్ పవర్, జూలై 15:** పాఠశాలల వద్ద మత్తు పదార్థాల విక్రయాన్ని అరికట్టే ఉద్దేశంతో జడ్డంగి పోలీసు శాఖ సక్రమంగా తనిఖీలు చేపట్టింది. జడ్డంగి జెడ్పీ ఉన్నత పాఠశాల చుట్టూ వంద మీటర్ల పరిధిలో ఉన్న కిరాణా దుకాణాల్లో మంగళవారం పరిశీలన చేపట్టారు. ఈ తనిఖీలను జడ్డంగి ఎస్ఐ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. విద్యార్థుల రక్షణే లక్ష్యంగా చేపట్టిన ఈ చర్యలో దుకాణదారులకు స్పష్టంగా తెలియజేశారు %-% పాఠశాలల సమీపాల్లో గుట్కా, ఖైదా, పొగాకు ఉత్పత్తులు విక్రయించడం చట్టవిరుద్ధం అని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల సమయంలో కొన్ని దుకాణాల్లో అనుమానాస్పదంగా గుట్కా ప్యాకెట్లు కనిపించగా వాటిపై సంబంధిత దుకాణదారులకు కచ్చితమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ. "పిల్లలు దేశ భవిష్యత్తు. చిన్న వయస్సులో మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ఉండేందుకు సమాజం బాధ్యతగా వ్యవహరించాలి. విద్యాసంస్థల పరిధిలో చట్టాన్ని అతిక్రమిస్తే కఠినంగా ఎదుర్కొంటాం" అని పేర్కొన్నారు. ఈ తనిఖీలతో స్థానికంగా చైతన్యం ఏర్పడింది. పాఠశాలల వద్ద మత్తు పదార్థాల నివారణకు ఎప్పటికప్పుడు తనిఖీలు కొనసాగుతాయని ఎస్ఐ తెలిపారు.

## జీజీహెచ్‌లో రూ.78.77 లక్షల విలువైన యంత్రపరికరాల ప్రారంభం

**కాకినాడ స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, జూలై 15:** కాకినాడ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.78.77 లక్షల విలువైన యంత్రపరికరాలు, ఆధునిక శెడ్లను జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మంగళవారం ప్రారంభించారు. ఈ పరికరాలు ఓఎన్జీసీ, యూనివర్సిటీ ఆఫ్ బయో ఫ్యూయల్స్, జెమినీ ఈడిబుల్ ఆయిల్స్ సంస్థల నుంచి సీఎస్ఆర్ నిధుల ద్వారా సమకూరాయి. న్యూరాలజీ, పలమనాలజీ, అనస్తీసియా, కార్డియాక్ విభాగాల కోసం ట్రామా కేర్ బ్లాక్‌లో, న్యూరో ఓపీ శెడ్‌ను కలెక్టర్, ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఆర్థోపెడిక్ ఓపీ వద్ద ప్రవెంటివ్ ఆంకాలజీ షెడ్, బ్లడ్ శాంపిల్ కలెక్షన్ ఓపీ షెడ్ కూడా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్య కుమారి, ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డా. విష్ణువర్ధన్, ఓఎన్జీసీ జీఎం కె. సునీల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శాకాంబరీ అలంకారంలో మరిడమ్మ



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 15 :** పెద్దాపు రం పట్టణంలో భక్తుల పాలిట కొంగుబం గారంలా విరాజిల్లుతున్న మరిడమ్మ అమ్మవా రు మంగళవారం శాకాంబరీ దేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారి మూల విరాట్టు, అర్చా మూర్తి, ఆలయ ప్రాంగణం, ఉపాలయాలను వివిధ రకాల కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఒకప్పుడు కరువుకాటకాల సమయంలో దేవతల ఆరాధనను మన్నించిన దేవి శతాక్షితా అవతరించి జీవరాశులన్నింటికి అవసరమైన ఆహారం, కూరగాయలు, పాడి పంటలు. జీవజలాలన్నింటినీ ఆమె శరీరం నుంచి విడుదల చేసి కాపాడిందని, ప్రజలకు కావాల్సిన శాకాలను సృష్టించినందుకు ఆమెను శాకంబరిగా కొలుస్తారని, ఈక్రమంలో శాకంబరీ ఉత్సవాలను అమ్మవారి ఆలయాలలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈ సందర్భంగా పండితులు వివరించారు. అమ్మవారిని దర్శంచుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తున్న నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మరిడమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి తెలిపారు.

# గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది

### రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 15:** గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం మంత్రి నారాయణ జగ్గంపేట విచ్చేశారు. ఆయన ముందుగా జగ్గంపేట టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. మంత్రి నారాయణకు జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రి నారాయణ స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో అన్ని శాఖలను నిర్వీర్యం చేసిందన్నారు. 10లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని విమర్శించారు. అయినప్పటికీ సీఎం చంద్రబాబు అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుపోతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా ప్రస్తుతం ప్రతీ రోజూ 2.25 లక్షల మంది రూ.5కే భోజనం చేస్తున్నారని గత ప్రభుత్వం మా మీద కక్షతో వాళ్లు అధికారంలోకి రాగానే మూసేశారన్నారు. మా కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. మరో 70 అన్నక్యాంటీన్లు మంజూరు చేశారని అందులో కొన్ని అక్టోబరు, నవంబరులో మొదలవుతాయన్నారు. ఇందులో జగ్గంపేటలో ఇప్పటికే అన్నక్యాంటీన్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. 2014-19లో మున్సిపాల్ శాఖ మంత్రిగా పనిచేశానని ఇప్పుడు అదే శాఖలో మంత్రిగా ఉన్నానని అయితే 2019 ఫిబ్రవరిలో తాను మంత్రిగా ఉండగా ప్రజా శ్రేయస్సు కోసం రూ.5350కోట్లతో ప్రాజెక్టు తీసుకువచ్చామని అది పూర్తయితే ఈ రాష్ట్రంలో ఉన్న మున్సిపాల్టీల్లో అన్ని ఇళ్లకు కుళాయి కనెక్షన్లు వచ్చి ఉండేవన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం పూర్తిగా దాన్ని నిర్వీర్యం చేసేసిందని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ ప్రాజక్టు అమలుకు చర్యలు చేపట్టామన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛను పెంచి ఇచ్చామన్నారు. మహిళలకు మూడు గ్యాస్ సిలెండర్లు ఇస్తామని చెప్పి అమలు చేస్తున్నామన్నారు. తల్లికి వందనం మాట చెప్పిన ప్రకారం 67లక్షల మందికి 10వేలకోట్లు తల్లుల ఖాతాల్లో వేశామన్నారు. ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం జమ చేశాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు జిల్లాల్లో ఉచిత బస్సు ప్రయాణం చేస్తామని సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారన్నారు. 2014-19లో పది వేస్ట్ ఎనర్జీ ప్లాంటులు మంజూరు చేస్తే వాటిని వైసీపీ ప్రభుత్వం ఆపేసిందని గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 123 మున్సిపాల్టీలు ఉంటే ప్రజలు కట్టే ట్యాక్స్ 3వేల కోట్లు గత ప్రభుత్వం డైవర్టు చేసిందని ఆరోపించారు. ఈ ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబుతో మాట్లాడి పంచాయతీలు, మున్సిపాల్టీలు పన్నులు వాళ్లే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరగా దీనిపై వెంటనే స్పందించి అధికారులకు సూచించారన్నారు. అలాగే ముఖ్యంగా గతంలో టిడ్కో ఇళ్లు 7 లక్షలు మంజూరు చేశామని గత ప్రభుత్వం వచ్చి మొత్తం ఆపేసి కొన్నింటికి రంగులు మార్చారే తప్ప ప్రజలకు అందజేయలేకపోయారన్నారు. జగ్గంపేటలో కూడా గతంలో టిడ్కో ఇళ్లు మంజూరు చేశారని కానీ వైసీపీ ప్రభుత్వం రాగానే లిటికేషన్ పెట్టి ఆపేశారన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ సంవత్సరంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని చెప్పడంతో నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నామన్నాని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో మెరిసిన జస్వంత్

### మంత్రి సుభాష్ అభినందనలు



**రామచంద్రపురం, పెన్ పవర్, జూలై 15:** నేపాల్‌లో జరిగిన ఇండో-నేపాల్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్%-%2025 పరుగు పోటీల్లో రామచంద్రపురం విద్యార్థి మేడిశెట్టి జస్వంత్ 3 కిమీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ విజయాన్ని అభినందిస్తూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం ప్రశంసలు కురిపించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న జస్వంత్‌కు ఇటీవల మంత్రి సుభాష్ రూ.20 వేలు సహాయం అందించడం తెలిసిందే. జస్వంత్ గతంలో ఓపెన్ నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్లో కూడా గోల్డ్ మెడల్ సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో రామచంద్రపురం ప్రతిష్టను చాటిన జస్వంత్‌ను మంత్రి ఫోన్ ద్వారా అభినందించారు. కోచ్ కె. నాగార్జునకు, జస్వంత్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.




## రెడ్ క్రాస్ గదుల నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

**కాకినాడ, పెన్ పవర్, జూలై 15:** కాకినాడలోని రెడ్ క్రాస్ భవన్ గదుల నిర్మాణానికి రూ.5 లక్షల విరాళాన్ని ఎన్ వివిఆర్ ప్రసాద్ బాబు అందించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ షణ్మోహన్ సాగిలి, సంఘానికి మద్దతుగా ముందుకు వచ్చిన ప్రసాద్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో 2021-22 నుండి 2023-24 వరకు నిర్మాణ పనులు జరుగుతుండగా, విరాళాల ద్వారా మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. సంస్థలు, వ్యక్తుల సహకారంతో ఓఎన్జీసీ ,కెఎస్ పీఎల్ వంటి పరిశ్రమల మద్దతు కూడా లభించింది. రాబోయే రోజుల్లో మరిన్ని దాతలు ముందుకు రావాలని జిల్లా కార్యదర్శి కే.శివకుమార్ ఆకాంక్షించారు.



## మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

**అల్లవరం, పెన్ పవర్, జూలై 15:** తాడేపల్లిలో వైఎస్ఆర్సిపి పార్టీ క్యాంప్ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని,బాపట్ల మాజీ పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్‌తో కలిపి మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్. ఎన్ని కష్టాలు వచ్చినా కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, రాబోయేది మన ప్రభుత్వమేఅని, భవిష్యత్తు మన కార్యకర్తలదే అని,అధికార పార్టీ ఎన్ని తప్పుడు కేసులు పెట్టిన తట్టుకొని నిలబడిన నందిగం సురేష్ అభినందిస్తూ, తప్పుడు కేసులకు తట్టుకుని నిలబడిన ప్రతి కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఇస్తామని భరోసా ఇచ్చారు, కోనసీమలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఇజ్రాయిల్ కీ సూచించారు.



## 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలి

**ఎటపాక ,పెన్ పవర్, జూలై15:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలోని బుట్టాయిగూడెం 33/11 కెవి సబ్ స్టేషన్లో రంపచోడవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియల్ మంగళవారం పత్రికా ప్రకటన చేశారు, ఎటపాక మండల పరిధిలోని ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు బుట్టాయిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని తోటపల్లి ,విఆర్ పేట విద్యుత్ బ్రేకర్ల మరమ్మత్తుల నిమిత్తం రెండు బ్రేకర్ల పరిధిలోని ఉన్నటువంటి తోటపల్లి, గన్నవరం, కాపవరం, నందిగామ, మురుమూరు, ఇస్పాపురం, కుసుమనపల్లి, బుట్టాయిగూడెం, కృష్ణవరం, గోమ్ము కొత్తగూడెం, చలంపాలెం, చోడవరం 12 గ్రామాలకు బుధవారం అనగా 16. 07. 2025 నా కరెంటు అంతరాయం ఏర్పడుతుందని అందుకుగాను వినియోగదారులు చింతించకుండా విద్యుత్ అధికారులకు సహకరించగలరని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ. గాబ్రియల్ కోరడమైనది.అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలోని బుట్టాయిగూడెం 33/11 కెవి సబ్ స్టేషన్లో రంపచోడవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియల్ మంగళవారం పత్రికా ప్రకటన చేశారు, ఎటపాక మండల పరిధిలోని ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు బుట్టాయిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని తోటపల్లి ,విఆర్ పేట విద్యుత్ బ్రేకర్ల మరమ్మత్తుల నిమిత్తం రెండు బ్రేకర్ల పరిధిలోని ఉన్నటువంటి తోటపల్లి, గన్నవరం, కాపవరం, నందిగామ, మురుమూరు, ఇస్పాపురం, కుసుమనపల్లి, బుట్టాయిగూడెం, కృష్ణవరం, గోమ్ము కొత్తగూడెం, చలంపాలెం, చోడవరం 12 గ్రామాలకు బుధవారం అనగా 16. 07. 2025 నా కరెంటు అంతరాయం ఏర్పడుతుందని అందుకుగాను వినియోగదారులు చింతించకుండా విద్యుత్ అధికారులకు సహకరించగలరని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ. గాబ్రియల్ కోరడమైనది.

## ఉత్తమ ఫలితాలు సాధించిన పూర్వ విద్యార్థి అభిరామ్ కు ఘన సన్మానం

**సన్మానించిన విజయ సాధన హై స్కూల్ కరస్పాండెంట్ డి రజిని**



**కూనవరం,పెన్ పవర్,జూలై 15:** విజయ సాధన హై స్కూల్ నందు 2022-23 సం లో పదవ తరగతి విద్యను అభ్యసించిన కారం అభిరామ్ విద్యార్థిని స్కూల్ కరస్పాండెంట్ డి రజిని సత్కరించారు.అభిరామ్ ఇంటర్ లో 977 మార్కులు సాధించి %××% మరియు మణిపూర్ లో NIT లో సీటు సాధించిన పూర్వ విద్యార్థిని స్కూల్ యాజమాన్యం మరియు సిబ్బంది,విద్యార్థులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ డి రజిని మాట్లాడుతూ అభిరామ్ ని ప్రతి విద్యార్థి,విద్యార్థిని ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణ,పట్టుదలతో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు,పుట్టి పెరిగిన ఊరికి పేరు తీసుకొని రావాలని అన్నారు.తమ విద్యార్థి అయినా అభిరామ్ ఉన్నత మైన శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థి తల్లిదండ్రులను సన్మానించారు.

# బీచ్ స్పోర్ట్స్ సౌకర్యాలకు టెండర్లు

## జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం పెన్ పవర్ జూలై 15:**

దిండి, ఆత్రేయపురం, అంతర్వేది బీచ్ అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్ ఫెసిలిటీ సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ఆరు పాయింట్లు గుర్తించి టెండర్లు పిలవడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు పర్యాటక రంగ అభివృద్ధి అధికారులు ఆరు బోటింగ్ పాయింట్లకు సంబంధించిన ఏజెన్సీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి ఇటీవల రూపొందించి సమర్పించిన సమగ్ర ప్రతిపాదనల పై సమీక్షించారు వశిష్ట గోదావరి నది బంగాళా ఖాతంలో కలిసే ప్రత్యేక మైన నదీముఖ ద్వారం వద్ద బోటింగ్ స్పోర్ట్స్ నిర్వ హించడం ద్వారా పర్యా టకపరంగా ఆదాయాన్ని గణనీయంగా ఆర్జించేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని జిల్లా కలెక్టర తెలిపారు.అంతర్వేది ఏటా వేలాది మంది యాత్రికులను ఆకర్షిస్తుందని,పర్యాటక మౌలిక సదుపాయాలు ఇంతవరకు అభివృద్ధి చెందలేదన్నారు.గౌతమి గోదావరి,వశిష్ట గోదావరి నదుల శాఖలు కాటన్ బ్యారేజీ వద్ద ఉద్భవించి కోనసీమ జిల్లా గుండా ప్రవహించి చివరకు బంగాళాఖాతం సముద్రంలోనికి ప్రవేశిస్తున్నాయన్నారు .కాటన్ బ్యారేజీ భాగంలోని బొబ్బర్లంక హెడ్ లాక్‌ల నుండి ప్రారం భమై ప్రధాన కాలువ బొబ్బర్లంక నుండి ఆత్రేయ పురం మండలంలోని లొల్ల వరకు దాదాపు 13 కి.మీ పొడవునా ప్రవహిస్తుంద న్నారు. లోల్లా విలేజ్ వద్ద మూల విభజన ఒక అద్భుతమైన పురాతన నిర్మా ణాన్ని సూచిస్తుందన్నారు, గొప్ప దృశ్యాలతో కూడిన అద్భుతమైన ప్రదేశం లోల్ల లాకులకు అత్యంత సమీ పంలో ఉన్న ప్రతిష్టాత్మక మైన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని యాత్రికులు సందర్శించి ప్రకృతిని ఆస్వాదిస్తారన్నారు.లొల్ల లాకులు, చిన్న ద్వీపాలు, కాలువలు, లాకులు, కొబ్బరి చెట్లు మొదలైనవి కలిగి ఉంటాయనీ సుదూర ప్రాంతాల నుండి కస్టమర్లను ఆకర్షిం చడానికి సహాయపడుతుందనీ, స్థానిక ఆధ్యాత్మిక భావన పర్యాటకులకు కొత్త అనుభూతిని ఇస్తుందనీ పర్యాటకులు స్పీడ్ బోట్లు, ఫుడ్ కోర్టులు, బోటింగ్ స్పోర్ట్స్ అనువుగా తీర్చిదద్దాలన్నారు. ప్రాజెక్ట్ మొత్తంగా పరిశ్రమ యొక్క పరిధి, సాధ్యతను మరియు ప్రధానంగా ఆర్థిక, సాంకేతి క మరియు మార్కెట్ విలు వలను భూ సేకరణ అంచ నాలను గుర్తించేం దుకు ఈనెల 18వ తేదీన క్షేత్రస్థాయిలో పర్యటించి సామాజిక-ఆర్థిక ప్రభా వాన్ని క్షుణ్ణంగా విచారించడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టులు మరింత ఎక్కువ మందికి పరోక్షంగా ప్రత్యక్షంగా ఉపాధిని సృష్టించగలవన్నారు. సేవల డిమాండ్‌ను తీర్చుతూ తద్వారా పరిశ్రమకు సేవ మద్దతును అందించే ఉత్పత్తి ,సేవలను పెంచడా నికి ఇతర వ్యాపార సంస్థల కు సహాయపడుతుందన్నారు. తద్వారా మరింత ఉపాధి జీవనోపాధి ఉత్పత్తి సర్వీసెస్. సుందరమైన కోనసీమ ప్రాంతంలో వాటర్ స్పోర్ట్స్ సౌకర్యాన్ని త్వరితగతిన ఏర్పాటుకు అంతర్వేది బోటింగ్ సర్వీసెస్ దోహద పడుతుందన్నారు.పర్యా వరణ పర్యాటకాన్ని ప్రోత్సహించే, పవిత్రమైన అంతర్వేది ఆలయానికి సాంస్కృతిక ప్రయాణానికి మద్దతు ఇచ్చి, స్థానిక జనాభాకు ఉపాధిని కల్పించే అధిక-నాణ్యత పర్యాటక ఆకర్షణను సృష్టించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యమన్నారు. పర్యాటకం కోసం 50 సీట్ల ప్యాసింజర్ బోట్ సర్వీస్ వంటి వివిధ రకాల రైడ్‌లు ఉన్నాయన్నారు. ఈ రైడ్‌లు దిండి వద్ద ఏపీ టీడీపీ- ఆమో దించిన జెట్టీని ఉపయో గించి ప్రారంభించబ డతాయన్నారు.ఇది కార్యాచరణ సామర్థ్యం మరియు భద్రతను నిర్ధారిస్తుందనీ.ఈ ప్రాజెక్ట్ లోతట్టు జలమార్గాల భద్రతా నిబంధనలను పూర్తిగా పాటించేలా మెరైన్ జల వనరులు మత్స్య శాఖల ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు.టికెట్ కౌంటర్లు, వేచి ఉండే ప్రాంతాలు, పార్కింగ్, విశ్రాంతి గదులు ఆహార దుకాణాలు వంటి సౌక ర్యాలను స్థానికంగా అభివృద్ధి చేసేందుకు భూసేకరణ చేపడతామ న్నారు.ఈ బోటింగ్ ప్రాజెక్ట్ ఒక మంచి పర్యావరణ పర్యాటక వెంచర్‌గా అవత రించే స్థితికి చేరనుందన్నారు.దిండిలో వృత్తిపరంగా నిర్వహించబడే బోటింగ్ వాటర్ స్పోర్ట్స్ హబ్‌ను స్థాపించడానికి మూడు ఏజెన్సీలు ఆరు పాయింట్లలలో అభివృద్ధికి సిద్ధమయ్యాయన్నారు. పర్యాటక అనుభవాలలో అత్యున్నత భద్రత నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించి,స్థానిక సాంస్కృతిక పర్యాటకాన్ని స్థిరంగా ప్రోత్సహించడం, సజావుగా కార్యకలాపాలు పర్యాటక నిబంధనలకు అనుగుణంగా కేంద్రీకృత టికెటింగ్ ,నిర్వ హణ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడంరైడ్ రకం స్పీడ్ బోట్ జెట్ స్కీ రైడ్50-సీట్ల బోటింగ్ ఏర్పాటు చేయడం చేయడం జరుగుతుందన్నారు. స్థానిక యువతకు ప్రత్య క్షంగా, పరోక్షంగా ఉపాధిని సృష్టిస్తుందన్నారు.కోనసీమ ప్రాంత పర్యా టక ఆర్థిక వ్యవస్థను బలో పేతం చేస్తుందన్నారు, సురక్షితమైన ఆనందించద గిన జల రవాణాను సులభ తరం చేస్తుందన్నారు.అంతర్వేది ఆలయానికి ఆధునిక నీటి ఆధారిత వినోదాన్ని సాంస్కృతిక పర్యాటకంతో కలపడం ద్వారా, ఈ ప్రాజెక్ట్ యాత్రికులు, కుటుంబాలు సాహస ప్రియులతో సహా విభిన్న పర్యాటక ప్రేక్షకులకు ప్రత్యేకమైన అనుభ వాలను అందిస్తుందన్నారు అనుబంధ సేవా ప్రదాత లకు మద్దతు ఇస్తుందన్నారు.

కోనసీమ ప్రాంతం యొక్క పర్యాటక ప్రొఫైల్‌ను గణనీయంగా పెరుగుతుందన్నారు.వశిష్ట గోదావరి నది సంగమం వద్ద ఉన్న అంతర్వేది బీచ్ వద్ద సమగ్ర సాహస జల క్రీడా సౌకర్యాన్ని అభివృద్ధి అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. గోదావరి- కోనసీమ టూరిజం సర్క్యూట్‌లో ఆర్థిక ప్రోత్సా హాన్ని సృష్టిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి నిషాంతి, పర్యాటక శాఖ ఆర్డి పవన్ కుమార్, బోటింగ్ అధికారి గంగ బాబు, జిల్లా పర్యాటక అధికారి అన్వర్ ఏజెన్సీలు ప్రతినిధులు పాల్గొన్నారు.





## ప్రతి పేదవాడికి సంక్షేమం అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే కొండబాబు

**కాకినాడ, పెన్ పవర్,జూన్ 15:** అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 8, 43వ డివిజన్లలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రానికి కలిగిన నష్టాలను కూటమి ప్రభుత్వం అధిగమిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోందన్నారు. వాగ్దానాలను నెరవేరుస్తూ, గ్రామాలు%-%పట్టణాలు అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో సుంకర పావని, తిరుమల కుమార్, బచ్చు శేఖర్, నీలకాయల సన్నీ కిరణ్, చొక్కా బాబురావు, లిఖితపూడి శ్రీధర్ బాబు, తాళ్లూరి కామేష్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశాల్లో ఉద్యోగావకాశాల కోసం యువతికి అవకాశం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

**కాకినాడ, పెన్ పవర్,జూలై 15:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో భరత్ పేల్స్ కంపెనీలో విదేశీ ఉద్యోగ అవకాశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎం. కొండలరావు తెలిపారు.విదేశీ ఉద్యోగాలకు అర్హత కలిగిన అభ్యర్థుల వయసు 24 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి. పదవ తరగతి నుంచి ఐటీఐ లేదా డిప్లొమా వరకు విద్యార్హత ఉన్నవారు అర్హులు. టెక్నీషియన్ విభాగాల్లో ఎంపికైన అభ్యర్థులకు నెల జీతం రూ.52,000 నుంచి రూ.61,500 వరకు, హెల్పర్ పోస్టులకు రూ.42,500 నుంచి రూ.52,500 వరకూ జీతాలు ఉండనున్నాయి. భద్రత, వసతి, ట్రాన్స్‌పోర్ట్ వంటి సదుపాయాలు కంపెనీ ద్వారా లభిస్తాయి. ఇంటర్వ్యూలు ఈ నెల 31లోపు నిర్వహించ బడతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు zregistration? pageRprogram-registration% వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయవచ్చని సూచించారు.వివరాలకు ఈ ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు: 8712655686, 9988853335,

## బీసీల ఐక్యతకు నాంది పలికే బీసీ ఆత్మీయ సమ్మేళనం

### మట్టా వీరబాబు గౌడ పిలుపు



**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 15:** కొత్తపేట నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 17వ తేదీన గురువారం నిర్వహించనున్న బీసీ ఆత్మీయ సమావేశానికి బీసీ సమాజం సమష్టిగా పాల్గొనాలని రాష్ట్ర కోఆర్డినేటర్ మట్టా వీరబాబు గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశం పార్టీలకు అతీతంగా బీసీల ఐక్యతను ప్రతిబింబించేందుకు ఒక వేదికగా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మంగళవారం ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాలకు చెందిన బీసీ సోదరులకు పిలుపు ఇస్తూ ఆయన మాట్లాడుతూ, "ఇది కేవలం ఒక సమావేశం కాదు, మన హక్కుల సాధన కోసం తీసుకునే మైలురాయి. బీసీలంతా ఒక్క తాటిపైకి వచ్చి సామూహికంగా ఆత్మీయతతో చర్చించుకోవాల్సిన సమయం ఇది" అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ హాజరవుతారని మట్టా వీరబాబు గౌడ వెల్లడించారు. బీసీలకు రాజ్యాధికారంలో సముచిత స్థానం దక్కేలా, స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ సాధించేందుకు ఈ సమావేశం చర్చా వేదికగా నిలవనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుడేల నాగేంద్ర గౌడ, బెజవాడ సతీష్, బుడంపత్తి ప్రసాద్, అయినం నాగరాజు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, వేముల శ్రీనివాసు, చిటికెన సత్యనారాయణ, పితాని పండు, తదితర బీసీ నేతలు పాల్గొన్నారు. బీసీ హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరు రాజకీయాలకు అతీతంగా, ఐక్యతతో ముందుకు రావాలని నేతలు ఆకాంక్షించారు.

## వాడపల్లి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 15:** ఏడు శనివారలా కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది భక్తులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధికారులను ఆదేశించారు.గత శనివారం 70 వేల మందికి పైగా భక్తులు స్వామి దర్శనానికి వచ్చిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీకర్, ఎమ్మార్వో, ఎంపీడీవో, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

**భద్రత, వైద్య సదుపాయాలపై దృష్టి**

భక్తుల రద్దీకి తగ్గట్టుగా పార్కింగ్ స్థలాలు, క్యూలైన్లు, తాగునీటి, విశ్రాంతి షెడ్లు వంటి సౌకర్యాల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. అలాగే, అత్యవసర సందర్భాల్లో ఉపయోగించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్‌లు, స్వల్ప వైద్య సేవలు అందుబా టులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.

**భక్తులకు భద్రతతో కూడిన దైవదర్శనం**

భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసు విభాగంతో సమన్వయం చేసి భద్రతా ఏర్పాట్లను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి ఒక్క భక్తుడు భక్తి భావంతో స్వామి వారిని దర్శించి, ప్రశాంతంగా తిరిగి వెళ్లేలా చూసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు.

**"వాడపల్లి ప్రసిద్ధి మరింత పెరగాలి"**

'వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రతీరోజూ భక్తులతో నిండి ఉండాలి. ప్రత్యేకించి శనివారాలు వచ్చే భక్తులకు మళ్లీ మళ్లీ రావాలనిపించే అనుభూతిని కలిగించాలి. అందుకోసం ప్రతి శాఖ సమన్వయంగా పనిచేయాలి," అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు , కాయల జగన్నాథం,కూటమి నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బయ్యన పల్లిలో రెండు ఇల్లు దగ్ధం





**గంగవరం, పెన్ పవర్, జూలై 15:** మండలంలోని బయినపల్లిలో సోమవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్ళు దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి 12 గంటల సమయంలో పాతర మల్లమ్మ పాతర లక్ష్మి లకు చెందిన ఇళ్ళు అగ్నికి ఆహుతి కావడంతో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. ఈ ప్రమాదంలో సుమారు 7 లక్షల రూపాయలు అస్తి నష్టం సంభవించినట్లు అంచనా. సంఘటన స్థలాన్ని బిజెపి మండల కమిటీ అధ్యక్షురాలు పుట్టపల్లి నీలాలమ్మ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు సం దర్శించి బాధితులకు నిత్యవసర వస్తువులు అందజేశారు అలాగే సంఘటన వివరాలు తెలుసుకున్న ఎస్సై వెంకటేష్ బాధిత కుటుంబాలకు 5000 రూపాయలు నగదు బియ్యం నిత్యవసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో బిజెపినాయకులు నరమాల శ్రీను ,పావని పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# వీడియో జర్నలిస్టు సుమన్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ అండ

## ఆర్థిక సహాయంతో పరామర్శించిన జర్నలిస్టు సంఘ నాయకులు

**కాకినాడ, పెన్ పవర్,జూలై 15:** సీనియర్ వీడియో జర్నలిస్టు మల్లాడి సుమన్ ఇటీవల తీవ్రమైన కాలు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ ప్రస్తుతం కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే ఒక సర్జరీ విజయవంతంగా పూర్తవ్వగా, మరో సర్జరీ కొన్ని రోజుల్లో జరగనుందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.సుమన్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు వాతాడ నవీన్ రాజ్, కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు సుమన్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి ధైర్యం చెప్పారు.జర్నలిస్టు లందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని నవీన్ రాజ్ సూచించారు. చురుకైన పాత్రికేయుడిగా కొనసాగుతున్న సుమన్, ప్రస్తుతం పూర్తిగా మంచానికి పరిమితమవ్వడంతో కుటుంబానికి పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ కష్టకాలంలో ఫెడరేషన్ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘ నాయకులు దుళ్ల శ్రీధర్, సత్య, పుర్రె త్రినాథ్ తదితరులు



పాల్గొన్నారు. సుమన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సంఘం తరఫున సాహాయం కొనసాగించనున్నారు.

## కరెంటు పోలుకు చుట్టుకున్న ఆకు తీగలు తొలగించండి

**ఎటపాక, పెన్ పవర్,జూలై 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలోని చోడవరం గ్రామంలో ఉన్నటువంటి నాగరాజు దాబా హెూటల్ ఎదురుగా జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న కరెంటు పోల్ కు ఆకు తీగలు చుట్టుకుని ఉండటంతో అది గమనించిన ఆయుర్వేదిక్ డాక్టర్ జమాల్ ఖాన్ ఈ తీగలను వెంటనే తొలగించాలని, లేనియెడల అక్కడకు ఎవరైనా వ్యక్తులుగానీ, పశువులు, మేకలు, మూగజీవాలు వచ్చి ఆకు తీగలను తినడం గాని ముట్టుకోవటం గాని జరిగితే పెద్ద ప్రమాదమే వాటిల్లే అవకాశం ఉందని అందుకు వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి కరెంటు స్తంభానికి చుట్టుకుని ఉన్న ఆకు తీగను తొలగించాలని కోరారు



## చంద్రబాబుతోనే సంక్షేమ పథకాలు సాధ్యం

### గ్రామ సర్పంచ్ సంగన

**సీతానగరం, పెన్ పవర్, జూలై 15:** ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయని సింగవరం గ్రామ సర్పంచ్ సంగన చిన పోసియ్య అన్నారు, మంగళవారం తమ గ్రామంలో సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు కార్యక్రమం ఇంటింటికి తిరిగిప్రభుత్వం ఇచ్చిన పథకాలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియజేస్తూ అభివృద్ధి పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంచుతూ ముందుకు సాగారు, సంక్షేమ పథకాలను రాష్ట్ర



ప్రజలకు అందించడంతో పాటు రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు చేపడుతున్న కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి మరోసారి అధికారం అందించాలని అన్నారు,

## దేవీపట్నం 9ఎకరాల సమస్య త్వరలోనే పరిష్కారం

### పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్

**దేవీపట్నం,పెన్ పవర్,జూలై15:** పోలవరం ప్రాజెక్టులో ఇంటి స్థలాలు,జీవనాధారాలు కోల్పోయిన దేవీపట్నం గ్రామానికి చెందిన నిర్వాసితుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ హామీ ఇచ్చారు.మంగళవారం దేవీపట్నం గ్రామ సర్పంచ్ కుంజం రాజమణి,గేదెల పెద్ద సుబ్బారావు,లంక హరిశ్చంద్రుడు,ఇతర నిర్వాసితుల ఆధ్వర్యంలో ధవలేశ్వరం భూసేకరణ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మండలంలోని 44 గ్రామాల నిర్వాసితులకు సంబంధించి వివిధ సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు.2013 భూసేకరణ చట్టం ప్రకారం,18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని గుర్తుచేశారు. దేవీపట్నం గ్రామం ఖాళీ చేసిన నాలుగేళ్లైనా ఇప్పటివరకు వారు అద్దె ఇళ్లలో జీవనం కొనసాగిస్తున్నారని,తక్షణమే అద్దెలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేట



ర్ అభిషేక్ మాట్లాడుతూ దేవీపట్నం గ్రామానికి సంబంధించిన 9 ఎకరాల భూమి కోర్టులో ఉన్న విషయం తెలిసిందే.సంబంధిత రైతు స్టే తీసుకురావడంతో సమస్య తలెత్తింది. ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాం.నెల నుండి రెండు నెలలలోగా స్టే ఎత్తివేయించేందుకు చర్యలు చేపడుతున్నాం,అని చెప్పారు.ఈ కార్యక్రమంలో లంక పోసిరావు, సిద్ధ నారాయణస్వామి, తిరుమలశెట్టి శారదమ్మ,నారాయణస్వామి,ఈశ్వరమ్మ, కర్మిరెడ్డి రామకృష్ణ, ప్రకాష్,మడకం రాజేష్,కుంజం ప్రవీణ్ కుమార్,మడకం బాబురావుతో పాటు అనేకమంది నిర్వాసితులు పాల్గొన్నారు.

## మహిళలకు కూటమి ప్రభుత్వంలో రక్షణ కరువైంది

### బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మరియదాసు



**కూనవరం,పెన్ పవర్,జూలై 15:**కూటమి ప్రభుత్వంలో బీసీ మహిళలకు రక్షణ కరువైందని వైసిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మరియదాసు ఆరోపించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ గుడివాడ జడ్పీ జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారిక పై హత్యాయత్నానికి పాల్పడిన కూటమి ప్రభుత్వ అనుచరులు దాడులకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించారు.కూటమి ప్రభుత్వంలో బీసీ మహిళలను టార్గెట్ చేసి వేధింపులు గురి చేయడం సరికాదని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే ఓటుతో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.మహిళలంటే ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.ఇప్పటికైనా దాడులు మాని ప్రజా సంక్షేమాన్ని కాపాడాలని హితవు పలికారు.తల్లికి వందనం పథకానికి కరెంట్ షాక్ కొట్టిందని ఎద్దేవా చేశారు.

# నిడదవోలు రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

### పి.ప్రశాంతి

**నిడదవోలు, పెన్ పవర్, జూలై 15:** నిడదవోలు రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల నేపథ్యంలో పంట పొలాలు ముంపుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఎక్సపెర్ట్ కమిటి క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి, రైతులకి ఎటువంటి ఆటంకం లేకుండా ప్రతిపాదించిన అంశాలపై నివేదిక అందచేయాలన్నారు. మంగళవారం నిడదవోలు ఆర్వోబి పనులను క్షేత్ర స్థాయిలో రెవిన్యూ, ఆర అండ్ బి, ఇరిగేషన్ అధికారులతో కలిసి కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి సూచనలు చేస్తూ, నిడదవోలు రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసే క్రమంలో రైతులు వెల్లడి చేస్తున్న అభ్యంతరాలకు సహేతుకమైన పరిష్కార మార్గం చూపాలన్నారు. నిర్మాణ పనులు వలన దారవరం గ్రామమునకు చెందిన రైతుల పంట పొలాలు ముంపుకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. ఈ వంతెన నిర్మాణం వలన రైతులు నష్టపోతారన్న అపోహ కారణం అన్నారు. రైతులకి మేలు చేసే క్రమంలో, భూ సమతుల్యత, ఎత్తు పల్లాలను గుర్తించి, తగిన నివేదిక అంద



చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ కు సంబంధించి ఎర్ర కాలువ వరదలు వచ్చినప్పుడు ముంపు ప్రమాదం నేపథ్యంలో పరిష్కారం కోసం అధికారులు ఇచ్చే సూచనలను అనుసరించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక అమలు చెయ్యాల్సి ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నిపుణుల బృందం, ఆర్డీవో, రైల్వే ఇంజనీరు, ఇరిగేషన్ ఎస్.ఈ, జిల్లా వ్యవ సాయ అధికారిలతో కలిసి మరోసారి వాస్తవ పరిస్థితిని అంచనా వేయాల్సి ఉందన్నారు. ఆర్వోబి నిర్మాణం వలన ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉందని, అదే సమయంలో రైతుల పంట పొలాలు ముంపుకు గురికాకుండా తగిన విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట కొవ్వూరు ఆర్డిఓ రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఆర్ అండ్ బి ఈఈ రూప్ కుమార్, డిఈ బి.వెంకట రమణ, నిడదవోలు తాహసిల్దార్ బి.నాగరాజు నాయక్, చాగల్లు తహసీల్దార్ ఎమ్.మెరికమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రెండు మూడు నెలల్లో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు

### రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటన

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 15:** రాష్ట్రంలో రెండు మూడు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి నారాయణ ప్రకటన చేశారు. మంగళవారం పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ రెండు మూడు నెలల్లో రాష్ట్రంలో 21 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. కొన్ని మున్సిపాలిటీలో కోర్టు కేసులు ఉన్నాయని, వాటిని నెల రోజుల్లో పరిష్కరించు కునేలా చర్యలు తీసుకుం టునామని చెప్పారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. విలీన గ్రామాలు లేకుండానే మున్సిపల్ ఎన్నికలకు వెళతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం,తణుకు, భీమవరం, పాలకొల్లు మున్సిపాలిటీలకు త్వరలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని వివరించారు. తాడేపల్లిగూడెం విమానాశ్రయ భూముల్లో పేదలకు పట్టాలిస్తామని తెలిపారు . ముందు స్థల వర్గీకరణ పూర్తి కావాలని, ఈ ప్రక్రియ పూర్తి చేసి ఇళ్ల స్థలా లు ఇచ్చేందుకు ఏర్పాటు చేయాలని అధికారులను కూడా



ఆదేశించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ అమలుకు చర్యలు తీసుకుంటునామని, 120 అడుగుల రోడ్డు 80 అడుగులకు కుదించిన సంఘటనలపై నివేదిక తీసుకున్నామని, దీనిపై టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఉన్నతాధికారులకు కూడా వివరాలు పంపామని చెప్పారు. టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై విచారణ పూర్తి చేసామని, త్వరలో ముఖ్యమంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తణుకులో భారీ ఎత్తున అవినీతి జరిగిందని తాడేపల్లిగూడెంలో దీనికి భిన్నంగా లబ్ధిదారుల పేరు మీద కాకుండా టిడిఆర్ బాండ్లు ఇతరుల పేరు మీదుగా ఇచ్చారని అధికారులు ఎలా చేశారనేది సమస్యగా ఉందని, అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టిడ్కో గృహాల నిర్మాణం తిరిగి ప్రారంభించాం అని త్వరలోనే లబ్ధిదారులకు వాటిని అప్పగిస్తామని మంత్రి చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో టిప్కో ఇల్లు ఇవ్వకుండా ఇచ్చినట్టుగా బ్యాంకు నుంచి రుణాలు చూపి ఇబ్బందులకు గురి చేశారని దీనిపై కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు నష్టం జరగకుండా బ్యాంకులకు రూ.140 కోట్లు చెల్లించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ ఇల్లు పూర్తి చేయాలంటే ఏడువేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని,కేంద్రం 4500 కోట్లు రిలీజ్ చేయడానికి సిద్ధంగా ఉందని వివరించారు.అయితే మిగిలిన 2500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే పరిస్థితుల్లో రాష్ట్ర ఖజానా లేదని తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణంలో 19వ వార్డులో పర్యటించిన మంత్రి ఒక మేజర్ డ్రైన్ నిర్మాణానికి మరో నాలుగు రోడ్లు ఏర్పాటుకు రెండు కోట్ల 85 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. కార్మిక బోర్డు చైర్మన్ టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జి వలవల బాబ్జి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజషన్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, తదితరులు ఉన్నారు. అనంతరం మంత్రి ఎల్ అగ్రహారంలో నిర్మించిన టిట్కో ఇళ్ళను పరిశీలించారు.

# అర్హుల పేదలకు సంక్షేమం అందించడమే కూటమి లక్ష్యం: మంత్రి సుభాష్





### సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం

**రామచంద్రపురం, పెన్ పవర్,జూలై 15:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. మంగళ వారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం లోని 12, 13, 14వ వార్డుల్లో మంత్రి స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి మార్గంలో ముందుకు సాగుతుందని, గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాలను కూటమి ప్రభుత్వం అధిగమించడానికి నిబద్ధతతో పని చేస్తోందన్నారు. ఆర్థిక లోటుపాట్లను సమర్థంగా అధిగమిస్తూ, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ప్రభుత్వం విజయవంత మవుతుందని తెలిపారు.ప్రతి గ్రామం, పట్టణ అభివృద్ధే లక్ష్యంగా కార్యాచరణ కొనసాగుతోందని పేర్కొన్న మంత్రి, కార్యకర్తలతో కలిసి ప్రజల మద్దతు పొందేందుకు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నామని తెలిపారు. ప్రజలు సానుకూలంగా స్పందించడాన్ని ఆయన సంతృప్తిగా గుర్తించారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, బూత్ క్లస్టర్ ఇన్‌చార్జులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## ఘనంగా టిడిపి నేత బంగారం జన్మదిన వేడుకలు

**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 15:** అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొట్టు బంగారం జన్మదిన వేడుకలు ఎన్టీఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లయ్య ఆధ్వర్యంలో బుల్లయ్య నివాస గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో నూకపెయ్యి సందీప్, గిడ్ల అనిల్ మారే రంజిత్ తదితరులు తెదేపా నాయకులు పాల్గొన్నారు.



## కూటమి పాలనలో ప్రజలు సుభిక్షంగా జీవిస్తున్నారు: వాసంశెట్టి సత్యం

**రామచంద్రపురం, పెన్ పవర్,జూలై 15:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషా లతో జీవిస్తున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. మంగళ వారం ద్రాక్షారామం లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సమావేశానికి నియోజక వర్గ పరిశీలకులు కాకినాడ రామా రావు అధ్యక్షత వహించగా, మండల కమిటీ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, వార్డు కమిటీ, నీటి సంఘం, సొసైటీ సభ్యులు తదితర విభాగాల నేతలు పాల్గొ న్నారు. వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ,



కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రజల విశ్వాసానికి తగిన విధంగా మంచి పాలన అందించడంలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులు నారుమడులు త్వరితగతిని పూర్తి చేసుకోవాలి




**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 14:** రైతులు నారుమడులు త్వరితగతిని పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి అన్నారు. మంగళవారం కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుధా మాధురి మాట్లాడుతూ సార్వా సీజన్ మొదలైంది కావున రైతులందరూ దమ్ములు చేపట్టి నారు మడులు వేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. నారుమడులు వేసుకునే ముందు రైతులు విధిగా విత్తన శుద్ధి పాటించాలన్నారు. కౌలు రైతులు తప్పకుండా కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద అందరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాఠంశెట్టి హరికృష్ణ, పి వెంకటలక్ష్మి అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## మా పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయున్ని నియమించండి



**కూనవరం,పెన్ పవర్,జూలై 15.:**విద్యార్థులకు విద్యను అభ్యసించవలసిన ఉపాధ్యాయుడు లేక మండలంలోని ముల్లూరు గ్రామం పాఠశాలలోని విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.మా గ్రామంలోని పాఠశాలకు విద్యను బోధించే ఉపాధ్యాయుడిని నియమించాలని ఇంచార్జి ఎంపీడీవో జగన్నాథ రావు కి స్థానిక సర్పంచ్ బొగ్గ వెంకమ్మ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సోడే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా పాఠశాలకు ఉపాధ్యాయులు లేరని కాంట్రాక్టు టీచర్ లతో విద్యను కొనసాగిస్తున్నారని ఇప్పటి కైనా రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.ఈ కార్యక్రమం మాజీ ఎంపీటీసీ మేకల నాగేశ్వరావు,శీలం ప్రసాద్,శీలం జ్యోతి,పైదా బొజ్జి,కుమారి,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా టీడీపీ నేత అడబాల వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై15:** రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట మండలం రామవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో నిర్వహించిన వేడుకలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై ఉదయం నుంచి ఆయన ఇంటి వద్ద సందడి చేశారు. వెంకటేశ్వరరావుకు పూల బొకేలు ఇచ్చి, సాలువాలు కప్పి సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామవరం గ్రామ ప్రజలు, అభిమానుల సమక్షంలో వెంకటేశ్వరరావు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.
పింఛన్ల సొమ్ము దుర్వినియోగం చేయలేదు

## పింఛన్ల సొమ్ము దుర్వినియోగం చేయలేదు కొందరు వెల్ఫేర్ అసిస్టెంట్ల వివరణ

**వై రామవరం, పెన్ పవర్, జూలై 15 :** వై రామవరం మండలంలో పింఛన్ల సొమ్ము దుర్వినియోగం చేయలేదని కొందరు వెల్ఫేర్ అసిస్టెంట్లు పెన్ పవర్ కు వివరణ ఇచ్చిన సంఘటన మంగళవారం జరిగింది. వీరు తెలిపిన వివరాల ప్రకారం పెన్ పవర్ దినపత్రికలో పింఛన్ సొమ్ము కాజేసిన వెల్ఫేర్ అసిస్టెంట్లు నిర్వీర్యంగా ఉన్న అధికారులు అనే శీర్షికన ఈనెల 14వ తేదీన వెలువడిన కథనంపై కొందరు వెల్ఫేర్ అసిస్టెంట్లు వివరణ ఇచ్చారు. కొందరు చేసిన తప్పిదాలకు తామందరిని బాధ్యులు చేయడం సరి కాదన్నారు. మండలంలో 17 పంచాయితీలు ఉండగా, ఎనిమిది మంది వెల్ఫేర్ అసిస్టెంట్లు సంతకాలు చేసి వివరణ ఇచ్చారు.



## అగ్రికల్చర్ చెక్‌పోస్ట్ వద్ద రోడ్డు ప్రమాదం: ఒకరు మృతి, మరొకరికి గాయాలు

**రావులపాలెం,పెన్ పవర్ జూలై 15:** రావులపాలెం మండలం గోపాలపురం అగ్రికల్చర్ చెక్‌పోస్ట్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గోపాలపురం గ్రామానికి చెందిన ఆవిడి సత్తిపండు (51) అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు అత్తిలి యేసుబాబు తీవ్రంగా గాయపడి ప్రస్తుతం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, సత్తిపండు యేసుబాబు ఇద్దరూ కలిసి చెక్‌పోస్ట్ వద్ద పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా, వెనుక నుంచి వస్తున్న ఎంఎల్03433 నెంబర్ గల ప్రైవేటు టూరిస్ట్ బస్సు అదుపుతప్పి వీరి వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది.



**వైద్యసాయం అందేలోపే సత్తిపండు మృతి**

ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే సత్తిపండు మరణించినట్లు వైద్యులు తెలిపారు. గాయపడిన యేసుబాబును రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా, రావులపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ పై సంబంధిత నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసినట్లు సమాచారం.

# ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం మాది





### మంత్రి నారాయణ, ఎమ్మెల్యే నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 15:** జగ్గంపేటలో కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ నేతృత్వంలో సుపరిపాలన తొలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగూరి నారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం అభివృద్ధిని వివరిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ డోర్ టు డోర్ తిరిగారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ద్వారానే మెరుగైన పాలన సాధ్యమని, ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలోనే పేద ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ అభివృద్ధి పదంలో రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తుందని సీఎం చంద్రబాబు అనునిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారని మంత్రి నారాయణపేర్కొన్నారు. జగ్గంపేట శెట్టిబలిజిపేటలో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలను, ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలతో అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు ముందుకు తీసుకెళుతున్నారని, ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నెహ్రూ తెలిపారు. ప్రజల అభిప్రాయాలను మై టిడిపి యాప్ లో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ పరిశీలకులు శీలం వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ లు అడబాల భాస్కరరావు, బస్వా వీరబాబు, ఉంగరాల రాము, రాష్ట్ర టిడిపి కార్యదర్శులు ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు లచ్చయ్య దొర, మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, చదరం చంటిబాబు, జగ్గంపేట టౌన్ అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కూడిన అభివృద్ధి, తగ్గిన ఇబ్బందులు:పితాని వెంకట్

### కూటమి పాలనపై ప్రజల్లో నమ్మకం

**పెనుమంట్ర, పెన్ పవర్, జూలై15:** కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే ప్రజలకు భరోసా కలిగించదని పితాని వెంకట సురేష్ అన్నారు. మండలంలోని నెలమూరు గ్రామం లో మంగళవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పినా స్పందన లేదని, పైగా వారిపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేసిన దుస్థితిని గుర్తు చేశారు. అయితే ఇప్పటి కూటమి పాలనలో ప్రజలు స్వేచ్ఛగా సమస్యలు చెప్పగలుగుతున్నారని, వాటికి వెంటనే పరిష్కారాల దిశగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ఒక్క సంతకంతో పింఛన్ పెంపు పింఛన్ల పెంపు విషయంలో వైసీపీ ఐదేళ్లపాటు ఆలస్యం చేయగా, కూటమి ప్రభుత్వం మాత్రం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క సంతకంతో పింఛన్‌ను పెంచిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఈ ఘనత దక్కుతుందన్నారు.సూపర్ సిక్స్, పీ4 లక్ష్యంప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే విధంగా సూపర్ సిక్స్ పథకాలను 95 శాతం మేర పూర్తి చేశామని, అట్టడుగు వర్గాలను ఆర్థికంగా బలపడేలా చేయడమే పీ4 లక్ష్యమని





చెప్పారు.అన్నదాతల కోసం ప్రత్యేక దృష్టి అన్నదాతలు ఆర్థికంగా మద్దతు పొందేందుకు త్వరలోనే వారి ఖాతాల్లో "అన్నదాత సుఖీభవ" నిధులు జమ కానున్నాయని వెల్లడించారు. రోడ్లు, గుంతల సమస్యలపై స్పందన జగన్ పాలనలో రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేకపోయిన పరిస్థితి ఉండగా, ఇప్పుడు గుంతల పూరణతో పాటు కొత్త రోడ్ల నిర్మాణం కూడా వేగంగా జరుగుతోందని తెలిపారు.

**ప్రజల అభిప్రాయంలో మార్పు**

ప్రతి ఊర్లో, ప్రతి పల్లెలో ప్రజలు కూటమి ప్రభుత్వం మంచిదని, నిజమైన పాలన ఎలా ఉండాలో చూపిస్తున్నదని స్పందిస్తున్నారని వెంకట్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం

**కె గంగవరం పెన్ పవర్ జులై 15:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాలు,రామచంద్రపురం డీఎస్పీ బి. రఘువీర్ మార్గనిర్దేశనల మేరకు,మంగళవారం పామర్రు మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ మరియు గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో శక్తి యాప్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సీఐ ఎం. వెంకటనారాయణ,పామర్రు ఎస్సై షేక్ జానీ బాషా, ట్రైనింగ్ డీఎస్పీ ప్రదీప్తి మేడం పాల్గొన్నారు.సుమారు 250 మంది బాలికలతో కూడిన విద్యార్థులకు శక్తి యాప్ ప్రాధాన్యత, అవసరం, ఉపయోగించే విధానం గురించి సమగ్రంగా వివరణ ఇచ్చారు.మహిళలపై జరుగుతున్న గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, పిల్లలపై జరుగుతున్న నేరాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో 112 నెంబర్‌కు డయల్ చేయడం ద్వారా పోలీసుల సేవలు ఎలా అందుబాటులోకి వస్తాయో వివరించారు.సమాజంలో మహిళలు సురక్షితంగా జీవించేందుకు శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు స్పష్టం చేశారు.విద్యార్థులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా అత్యవసర సమయంలో వెంటనే పోలీసులను సంప్రదించవచ్చని తెలియజేశారు.ఈ అవగాహన సదస్సు విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించడంలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది.

## కాజులూరులో "పొలం పిలుస్తుంది" కార్యక్రమం

### రైతులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన




**కాజులూరు, పెన్ పవర్,జూలై 15:** కాజులూరు మండలం కోలంక గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "పొలం పిలుస్తుంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ మాట్లాడుతూ, రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను అవలంబించి లాభాలను పెంచుకోవాలని సూచించారు.ఆధునిక పద్ధతుల్లో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం 80% సబ్సిడీతో వ్యవసాయ డ్రోన్లు అందుబాటులోకి తీసుకువచ్చిందని, గ్రామ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే, ప్రధానమంత్రి పసల్ భీమా యోజన కింద పంట రుణం తీసుకున్న, లేదా తీసుకోని రైతులు రూ.770 ఎకరాకు బీమా ప్రీమియం చెల్లించి పంటల బీమా తీసుకోవాలని వివరించారు. ఇది ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు భద్రతనిస్తుందని పేర్కొ న్నారు. కౌలు రైతులు తమ పంట సాగుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు (సిసిఆర్సీ కార్డులు) తప్పని సరిగా తీసుకోవాలని, అలాగే ఏ పంట సాగు చేస్తున్నారో రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాల్సిందిగా తెలిపారు. మరింత సమాచారం కోసం రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస వర్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు శ్రీ దంతులూరి నరసింహరాజు, తిరువూరి బుల్లి రాజు, నామా రామకృష్ణ, నామా వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు న్యాయంగా ఎరువుల పంపిణీ జరగాలి

### కె గంగవరం, రామచంద్రపురం మండలాల్లో స్కేడ్ అధికారుల తనిఖీలు.

**కె గంగవరం పెన్ పవర్ జులై 15:**కే గంగవరం మరియు రామచంద్రపురం మండలాల్లో మంగళవారం రాష్ట్ర స్థాయిలో కేటాయించిన స్కేడ్ అధికారులు ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో నరసన్నపేట నుంచి వచ్చిన సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్.వి. మధు, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ డి.వి.వి. సతీష్ కుమార్ పాల్గొన్నారు.డీలర్లు ఎరువులపై కృత్రిమ కొరత సృష్టించి ధరలు ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచకూడదని వారు స్పష్టం చేశారు.అలాగే రైతులకు ఎరువులు సరఫరా చేసే సమయంలో ఈ-పోవాస్ యంత్రాల్లో వారి వేలిముద్రలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. వ్యవస్థ పారదర్శకంగా ఉండేలా చూడాలని, ఎలాంటి అక్రమాలకు తావు ఉండకూడదని అధికారులు హెచ్చరించారు.ఈ తనిఖీల సందర్భంగా ఇంచార్జి ఏడీఏ (రామచంద్రపురం) టీవీఆర్ మణిదీప్, కె గంగవరం ఏవో సద్గురుమూర్తి, ఏఈవోస్ ప్రేమ్ కుమార్, హేమంత్ కూడా ఉన్నారు. అధికారులు రైతుల సమస్యలను తెలుసుకుని, డీలర్ల వ్యవహారాలపై సమీక్ష నిర్వహించారు.ఈ తనిఖీలు రైతులకు న్యాయంగా,



సమయానికి ఎరువులు అందేలా చేపట్టిన చర్యల్లో భాగంగా జరిగాయని వారు తెలిపారు.



## విద్యార్థులు బాగా చదువుకోవాలి
### ఎమ్మెల్యే శిరీష దేవి

**గంగవరం, పెన్ పవర్, జూలై 15:** విద్యార్థులు శ్రద్ధగా బాగా చదువుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి అన్నారు. మంగళవారం మండలంలోని సూరంపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులకు అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. యూనిఫామ్ బాగుంది ఎవరిచ్చారు అని విద్యార్థులను ఎమ్మెల్యే ప్రశ్నించగా లోకేష్ మావ ఇచ్చాడంటూ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. తమ పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని ప్రహరీ లేకపోవడంతో పశువులు గార్డెన్ పాడు చేస్తున్నాయని ఉపాధ్యాయులు విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని రాగా త్వరలోనే ప్రహరీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు మొల్లేరు సొసైటీ అధ్యక్షుడు పాము అర్జున, బిజెపి అధ్యక్షురాలు నీలాలమ్మ, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, టిడిపి రాష్ట్ర రైతు కార్యదర్శి కనిగిరి రాంబాబు, ప్రధానోపాధ్యాయులు సాయిబాబా, ఉపాధ్యాయులు నాగమణి తదితరులున్నారు.

# సుపరిపాలన తొలి అడుగు
### ఇంటింటికీ టీడీపీ ప్రచారం
### జమాల్‌ఖాన్ ఆధ్వర్యంలో బొడ్డుగూడెంలో కరపత్రాల పంపిణీ



**చింతూరు, పెన్ పవర్, జూలై 15:** తెలుగుదేశం పార్టీ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడుగుంాళ్లపల్లి పంచాయతీ పరిధిలోని బొడ్డుగూడెం గ్రామంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మహమ్మద్ జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, కార్యకర్తలు గ్రామంలో తిరుగుతూ టీడీపీ ప్రభుత్వ సుపరిపాలన లక్ష్యాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు నిబద్ధతతో పని చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి చేరేలా చేయాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాలకు మరింత న్యాయం జరగాలని, ప్రజల అభిప్రాయాలను సాంకేతికంగా నెట్ ద్వారా పార్టీకి అందజేస్తూ వారిని ప్రభుత్వానికి దగ్గర చేయాలని సూచించారు. అలాగే ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయ బోర్లు గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని, వ్యవసాయ పంపుసెట్ల ఏర్పాటు కోసం ప్రభుత్వంతో చర్చించి తగిన నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సాల్మన్ రాజు, బొడ్డుగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు మడక వెంకయ్య, కార్యదర్శి భూక్య మోహన్, మహిళ నాయకురాలు భూక్య జయసుధ, కనితి శివాజీ, రవ్వ జోగారావు, రవ్వ కన్నమ్మ, రవ్వ లక్ష్మి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం




**ఆలమూరు, పెన్ పవర్, జూలై 15:** అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీవో ఏ.రాజు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీడీవో రాజు ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రజా ప్రతినిధుల మధ్య వాడి వేడిగా సాగింది. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. వీటిపై ప్రజా ప్రతినిధులు పంచాయతీలలో సమస్యలను లేవనెత్తి అధికారులను నిలదీశారు. చివరగా వారు మాట్లాడుతూ, అధికారులు అవృవద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కాకపోవడాన్ని వారు తప్పు బట్టారు. స్థానిక ఆసుపత్రిలోని రోగులను ప్రతి చిన్న రుగ్మతకు వేరే ఆసుపత్రికి రిఫర్ చేయడం సరైన విధానం కాదని ప్రజా ప్రతినిధులు అన్నారు. అనంతరం ఇటీవల డిసి అధ్యక్షుడిగా ఎన్నికైన మెర్ల గోపాలస్వామిని ఎంపీడీవో రాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ కె.జె.ప్రకాష్ బాబు, మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## లైబ్రరీపై అంతస్తు నిర్మాణ పనులు పరిశీలన



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 15:** మండల కేంద్రంలోని లైబ్రరీ భవనం యొక్క పై అంతస్తు నిర్మాణ పనులను ఎంపీడీవో ఏ.రాజు మంగళవారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీ పాఠకులకు వసతుల కల్పనలో భాగంగా పై అంతస్తు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందుకోసం 15వ ఆర్థిక సంఘం నిధులలో మండల పరిషత్ నుంచి రూ. 6 లక్షలు, పంచాయతీ నుంచి రూ. 4 లక్షలు మొత్తం పది లక్షలతో అభివృద్ధి జరుగుతున్నట్లు ఆయన వివరించారు. నిర్మాణ పనులు అంత్యదశకు చేరుకున్నాయన్నారు. దీంతో ఈనెల 18న పై అంతస్తు ప్రారంభించి, లైబ్రరీ పాఠకులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ ఈదల నల్లబాబు, లైబ్రేరియన్ నమశ్శివాయ పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత
### శాసనసభ్యులు శిరీష దేవి, జ్యోతుల నెహ్రూ





**గంగవరం, పెన్ పవర్, జూలై 15:** రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జగ్గంపేట శాసనసభ్యులు ,తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులు జ్యోతుల నెహ్రూ ,రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి అన్నారు. మంగళవారం మండలంలోని సూరంపాలెం రిజర్వాయర్ సాగునీటిని వారు ఖరీఫ్ పంటకు లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను చేపడుతుందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ నిధులను రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. సూరంపాలెం రిజర్వాయర్ ద్వారా గోకవరం, గంగవరం, కోరుకొండ మండలం చెందిన సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. తొలిత ప్రాజెక్టు వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి గేట్లను ఎత్తి సాగునీరును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, వైస్ చైర్మన్ లు రాంబాబు ,సంజీవరావు, సూరంపాలెం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రావు, డి ఈ ప్రసాద్, ఏఈలు దామోదర్, రామారావు, వంశీధర్ ,మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, మొల్లేరు సొసైటీ అధ్యక్షులు, టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు పాము అర్జున, టిడిపి రాష్ట్ర రైతు కార్యదర్శి కనిగిరి రాంబాబు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దు: ఎస్సై నరేష్



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 15:** మనకు ఏ ప్రాంతానికి ఉద్యోగ బదిలీ జరిగినప్పటికీ విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని ఆలమూరు ఎస్సై జి.నరేష్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో ఆయన మహిళా పోలీసులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా సచివాలయాల వారీగా గుర్తించిన సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యకు ఒక పరిష్కార మార్గం ఉంటుందన్నారు. అది మీ పరిధిలో పరిష్కారం కానప్పుడు ఉన్నతాధికారులకు తెలియపరచి పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఏదైనా సందర్భంలో ఒక సమస్యను పరిష్కరించినప్పుడు ఆ విషయాన్ని ఉన్నత అధికారులకు తెలియజేయడం మంచి పద్ధతి అని ఆయన వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకోవాలనుకుంటే వారికి వీలైనంత దగ్గరగా ఉంటే త్వరగా శోధించవచ్చు అన్నారు.

### పొలానికి నీరు పెడుతూ
## ప్రమాదవశాత్తు రైతు మృతి
### బొడ్డివాని లంక గ్రామంలో విషాదం







**కాజులూరు, జూలై 15 పెన్ పవర్:** కాజులూరు మండల పరిధిలోని ఒంటితాడి గ్రామంలో మంగళవారం విషాద సంఘటన చోటుచేసుకుంది. పొలానికి నీరు పెడుతూ ఒక రైతు ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి మృతి చెందాడు. తాళ్ళరేవు మండలం కోరంగి గ్రామ పంచాయతీ పరిధిలోని బొడ్డువానిలంకకు చెందిన నరాల నాగరాజు (35)తండ్రి విష్ణు,ఒంటితాడిలో కౌలుకు తీసుకున్న రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.పంటకు నీరు పెడుతున్న సమయంలో కాలువలోకి జారి పడటంతో ఊబిలో కాళ్ల చిక్కుకొని స్పృహ కోల్పోయినట్టు చెబుతున్నారు. పొలం పనులు ముగించుకుని వస్తున్న మహిళలు ఈ దృశ్యాన్ని గమనించి స్థానికులను అప్రమత్తం చేశారు.అయితే అప్పటికే నాగరాజు మృతి చెందినట్టు గుర్తించారు.సమాచారం తెలుసుకున్న గొల్లపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. జీజీహెచ్‌లో పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించగా, వైద్యులు కూడా మృతిని నిర్ధారించారు. గొల్లపాలెం ఎస్సై ఎం. మోహన్ కుమార్ ఆధ్వర్యంలో కేసును పరిశీలిసున్నారు.స్థానికుల సమాచారం ప్రకారం మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.ఘటన సాయంత్రం ఐదు గంటల సమయంలో చోటుచేసుకున్నదిగా పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## నిబంధనలు పాటించాలి: ఎస్సై నరసింహమూర్తి



**రాజవొమ్మంగి, పెన్ పవర్ జూలై 15:** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని రాజవొమ్మంగి ఎస్సై నరసింహమూర్తి సూచించారు. మండలంలోని ప్రధాన కూడళ్లలో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. వాహనానికి సంబంధించిన అన్ని రకాల పత్రాలు వాహనంలో ఉంచుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించరాదని హెచ్చరించారు. ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకునే సమయంలో డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతను కాపాడే విధంగా వ్యవహరించాలని ఎస్సై నరసింహమూర్తి హితవు పలికారు.

## వై.సి.పి.కార్యకర్తల పై ఇష్ట మొచ్చినట్లు
# మాట్లాడడం తగదు



**వి.ఆర్.పురంపెన్.పవర్.జూలై.15:** మండలంలోని చింతరేవుపల్లి గ్రామానికి చెందిన వై.సి.పి నాయకులు కోటం జయ రాజు పంచాయితీ సర్పంచ్,పిట్టా రామా రావు మాట్లాడుతూ మా వై.సి.పి.పార్టీ కార్యకర్తలను రహదారి మార్గ మధ్యలో కలిసి టీడీపీ సీనియర్ నాయకులు ఒకరు ఇష్ట మొచ్చినట్లు మాట్లాడడం తగదు. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. వి. ఆర్.పురం మండలంలో ఎన్నో పార్టీలు ఉన్నాయని,ఒక కుటుంబం లాగా ఉంటున్నాయని,ఏ చిన్న విషయం వచ్చిన పార్టీ పెద్దలకు తెలియ జేస్తే వారు ఆ కార్యకర్తను మందలించి మనమంతా కుటుంబం లాగా ఉంటున్నాము.కార్యకర్తలు ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణతో పార్టీ ఉండాలని,నాయకులు చెపుతూ ఉంటారు.కొంతమంది నాయకులు తెలిసి చేస్తు న్నారో తెలియకుండా చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఇలాగే చేస్తానంటే వై.సి.పి.పార్టీ ఊరుకోదని,మళ్ళీ కావాలని అలానే చేస్తే మేము కూడా క్రమశిక్షణ తప్ప వలసి వస్తుందని,టిడిపి నాయకులకు తెలియ జేస్తున్నా ము.ఎందుకంటే ఏదో ఒక రోజు మీ పార్టీ వాళ్లు తప్పు చేయకుండా ఉండరు.తప్పు చేసిన వాళ్ళ తరుపున మేము మాట్లాడం తప్పు చేసిన వాళ్ళను ఖండిస్తాం? అంతే కానీ వాళ్లను పిలిచి మరీ మందలిస్తే చూస్తూ ఊరుకోమని, వై.సి.పి. నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

## నేతాజీ విద్యార్థిని నాట్య ప్రదర్శనలో ప్రతిభ
### అభినందించిన స్కూల్ అధినేత శ్రీనివాసరావు



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 15:** ఇటీవల విశాఖపట్నంలో జరిగిన 36వ ఆలిండియా క్లాసికల్ అండ్ ఫోక్ డాన్స్ కాంపిటీషన్లో సినీ క్లాసికల్ డాన్స్ పోటీల్లో మండలంలోని చెముడులంక నేతాజీ స్కూల్ ఏడవ తరగతి విద్యార్థిని జి.దివ్యశ్రీ కూచిపూడి లో అత్యుత్తమ ప్రదర్శనతో ప్రథమస్థానం కైవసం చేసుకుని అందరి మన్ననలు పొందింది. రాష్ట్ర స్థాయిలో వివిధ సంస్థలు నిర్వహించిన ఈ పోటీల్లో మా స్కూల్ విద్యార్థిని దివ్యశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు స్కూల్ కరస్పాండెంట్ తుమ్మ శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు. భవిష్యత్తులో కూడా దేశ స్థాయిలో మరింత ఉత్తమ ప్రతిభ కనపరిచి స్కూలుకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే ప్రిన్సిపాల్ టి.అరుణ, ఇంచార్జ్ దూలం స్వామి, సిద్ది రెడ్డి సూరిబాబు, మద్దూరి ప్రసాదు, సుంకర దుర్గ, పోలావతి, రాజశేఖర్, తదితరులు విద్యార్థి దివ్యశ్రీని అభినందించిన వారిలో ఉన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్



**ఆలమూరు, పెన్ పవర్, జులై 15:** ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అనుమతులు మంజూరు కావడానికి విశేషంగా కృషి చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు కళాశాల ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం వాడపాలెంలోని ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని ఎమ్మెల్యేను కలుసుకొని ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరుకున్న ఆలమూరు జూనియర్ కళాశాల భవనాలు తొలగించాల్సిందిగా ఆర్ అండ్ బి 2019లో నివేదిక ఇచ్చిందని, మరలా ఆర్ అండ్ బి అధికారులు సోమవారం కళాశాల పాత భవనాలను పరిశీలించి పూర్తిగా తొలగించాలని గత నివేదికను సమర్థిస్తూ మరో మారు నివేదికను కలెక్టర్ కార్యాలయానికి పంపినట్లు ప్రిన్సిపాల్ సురేష్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. అలాగే నూతన కళాశాల భవనం నిర్మితమయ్యే వరకు ప్రస్తుతం ఆలమూరు జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం ఎమ్మెల్యే సత్యానందరావు కృషితో కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం ఉన్న ఆధునిక నిర్మాణాలకు జతగా మరో నాలుగు తరగతి గదుల నిర్మాణం తో పాటు కళాశాల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సైతం అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.




## మీడియేషన్ ఫర్ ది నేషన్ పై అవగాహన ర్యాలీ

**ఆలమూరు, పెన్ పవర్, జూలై 15:** "మీడియేషన్ ఫర్ ది నేషన్" అనే అంశంపై ఈనెల 10 నుండి 16 వరకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు అందులో భాగంగా మంగళవారం స్థానిక కోర్ట్ ఆవరణ నుండి వినాయక గుడి వరకు జూనియర్ సివిల్ జడ్జి ఐ.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్య వర్తిత్వంపై ప్రజలు అవగాహనా కలిగి ఉం డాలన్నారు. కోర్ట్ లో పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరి ష్కరించుకోవాలని ఆయన సూచించారు. తద్వారా సమయంతో పాటు ధనం వృధా కాదన్నారు. ఈ మధ్యవర్తిత్వం పరిధిలోనికి సివిల్, క్రిమినల్ కేసులు అన్ని వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాబు షూరిటీతో రౌడీయిజం గ్యారెంటీ

## మాజీ మంత్రి కొట్టు వ్యాఖ్య




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 15:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవిష్యత్తు గ్యారెంటీ ఇస్తామని ప్రగల్భాలు పలికి ముఖ్యమంత్రి చంద్రబాబు రెడ్ బుక్ రాజ్యాంగ అమలు చేస్తుండడంతో రౌడీయిజం గ్యారెంటీగా కనపడుతోందని తాడేపల్లిగూడెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం మాధవరం లో మండల స్థాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ మేనిఫెస్టో ను చూపిస్తూ ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, ఏంటి మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, నాయకులు కర్రి భాస్కర్ రావు, ఎలిశెట్టి నరేంద్ర కుమార్, తమ్మిశెట్టి చుక్కయ్య, బొద్దాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బైండవర్ చేసిన బాండ్‌ను ఉల్లంఘించినందుకు 10,000 జరిమానా

## విధించిన తహసిల్దార్..

## కల్లు శాంపిల్స్ సేకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

**టి నరసాపురం, పెన్ పవర్, జూలై 15:** తిరుమల దేవిపేట గ్రామంలోని పాత నాటు సారాయి కేసులో నిందితుడు అయిన అబ్బదాసరి చిన సత్యనారాయణను మంగళవారం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్(తహసీల్దార్ )వారి ఎదుట హాజరు పరచగా బైండవర్ చేసిన బాండ్ ను ఉల్లంఘించినకు గాను సత్యనారాయణకు తహసీల్దార్ 10,000 అపరాధ రుసుము ను ప్రభుత్వమునకు చలానా రూపము లో చెల్లించ వలసినదిగా ఆదేశించినట్లు చింతలపూడి ఎక్సైజ్ సి.ఐ.పి.అశోక్ తెలిపారు. జిల్లా ప్రోహిబిషన్ & ఎక్సైజ్ అధికారి ఏ.ఆవులయ్య వారి ఆదేశాలతో చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోనీ టి. నర్సాపురం మండలంలో జరిగిన ఎక్సైజ్ దాడుల్లో బొర్రంపాలెంలో నూతి వేంకటేశ్వర రావు అను వ్యక్తి వద్ద నుండి 180 యం ఎల్ పరిమాణము గల 6 మద్యం సీసాలను స్వాధీన పరచుకొని అతని పై కేసు నమోదు చేయడమైనదన్నారు. అదే విధంగా



కల్లు సొసైటీ లోని కల్లు దుకాణముల నుండి రసాయన పరీక్ష పంపు నిమిత్తం మొత్తం నాలుగు కల్లు శాంపిల్స్ లను తీయడమైనదన్నారు . ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్.ఐ.అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

# కల్లేరు గ్రామంలో మంచినీటి సమస్యపై ఐద్వా ఆధ్వర్యంలో మహిళల ధర్నా

## అంతర్గత రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు,వెంటనే నిర్మాణం చేపట్టాలని డిమాండ్



**చింతూరు, పెన్ పవర్, జూలై 15:** చింతూరు మండలంలోని కల్లేరు గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని, అంతర్గత రోడ్లు నిర్మించాలని కోరుతూ ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో భారీగా మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు ఖాళీ బిందెలు, కలుషిత నీటితో ఉన్న బిందెలను పట్టుకొని కల్లేరు సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా చింతూరు మండల అధ్యక్షురాలు మడివి శ్రీదేవి మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న బోర్లు చెడిపోయి, కలుషిత నీరు వస్తోందని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటిదాకా ఎటువంటి పరిష్కారం లేదు. పైప్ లైన్ ద్వారా వచ్చే మంచినీరు కూడా ఆగిపోయింది. ఇదంతా అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక, గ్రామానికి చెందిన ప్రజలు ప్రధాన రహదారికి చేరడానికి అంతర్గత రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళలు సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులు స్పందిస్తూ, తమ పరిధిలో ఉన్న మంచినీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, మిగతా సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొంత మేరకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఈ సందర్భంగా మడివి శ్రీదేవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి




చేసుకుందంటూ వార్షికోత్సవాలు జరుపుకుంటోంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైంది. గత ప్రభుత్వ హయాంలో జల జీవన్ మిషన్ కింద కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం కలగలేదు, అని విమర్శించారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఇచ్చే మహాలక్ష్మి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో కూడా ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కమిటీ సభ్యురాలు సోడా చిన్నమ్మి, సోడే రాములమ్మ, కమలమ్మ, పొడియం బుచ్చమ్మ, రాజమ్మ, జోగమ్మ, కుంజా మార్కమ్మ, కారం సుబ్బమ్మ, కుంజా చుక్కమ్మ, గిరిజన సంఘం నాయకులు సోడా రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 15:** స్థానిక సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తామని సూపరింటెండెంట్ ఎం.శివశంకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆయన వైద్యులతో సమీక్షలో మాట్లాడారు. సుమారు రూ. ఆరు కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. అలాగే రోగులకు అవసరమైన సదుపాయాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రక్త పరీక్షల స్థాయిని మరింత పెంచేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఆస్పత్రిలో వైద్యారోగ్య సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. ఈనెలాఖరు నాటికి ప్రతిష్టాత్మకమైన ఎక్స్ రే యూనిట్ అందుబాటులోకి వస్తుందన్నారు. అలాగే ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద రోగులకు శస్త్ర చికిత్స సేవలు అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. క్రిటికల్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో డ్రైనేజ్ సమస్య వేధిస్తుం దన్నారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడగా పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. అందుబాటులో ఉన్న వైద్యులు ప్రసూతి వైద్య నిపుణులు కె.స్వర్ణలత, జనరల్ సర్జన్ సీహెచ్.ప్రసన్న, పీడియాట్రిషన్ ఎన్. అభిలాష్, డెంటల్ నిపుణులు పి.హిమబిందు, అనస్తీసియా నిపుణులు సుభాషిని, జనరల్ వైద్యులుగా డి.శిరీష, కె .సుష్మితలు ఉన్నారన్నారు. వీరందరి సేవలతో పాటు నేను కూడా ప్రత్యేక ఓపి చూస్తున్నట్లు మండల ప్రజలు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని సూపరిండెండెంట్ శివ శంకర్ కోరారు.

# ఏఎంసి పాలకవర్గ ప్రమాణస్వీకారం ఏర్పాట్లు పరిశీలన

## ఏర్పాట్లను పరిశీలనలో బండారు శ్రీనివాస్, కూటమి నాయకులు

**ఆలమూరు, పెన్ పవర్, జులై 15:** మండల కేంద్రమైన ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం ఈనెల 20న జరగనునందున ఏర్పాట్లను కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఆలమూరు మండల కూటమి నాయకులతో కలిసి ఆయన స్థానిక ఏఎంసి కార్యాలయం తోపాటు పాలకవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహిం చనున్న మెయిన్ రోడ్‌లోని ఆర్ఎస్ఎన్ కన్వెన్షన్ హాల్‌ను పరిశీలించిన ఏర్పాట్లు పై పలువురు నాయకులు సూచనలు సలహాలను స్వీకరించారు. ఆలమూరు ఎఎంసి చైర్పర్సన్‌గా మడికి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకురాలు కొత్తపల్లి వెంకటలక్ష్మి నియమితులైన సంగతి తెలిసిందే. ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్ర మంత్రులు



కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రముఖులు నాయకులు అధికారులు పాల్గొన్న ఉన్నారని అందువలన ఏర్పాటు పకడ్బందీగా ఉండాలని పలువురు సూచించారు.ఏర్పాట్లు పరిశీలనలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై దాడి 8 మంది వ్యక్తులు అరెస్ట్

**టి.నరసాపురం, పెన్ పవర్, జులై 15,:** పోలవరం డిఎస్పి ఎం. వెంకటేశ్వరరావు జీలుగు మిల్లి ఇన్స్పెక్టర్ బి వెంకటేశ్వరరావు యొక్క ఆదేశాలపై. మంగళవారం టి.నరసాపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం. జయబాబు కి రాబడిన సమాచారం మేర ఎస్ఐ సిబ్బందితో కలిసి మండలం లోని వల్లంపట్ల పంచాయతీ పరిధిలోని సింగరాయపాలెం గ్రామ శివారులో ఉన్న పేకాట శిబిరం పై ఆకస్మికంగా దాడి చేశారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.40,500/- నగదు, 12 మోటార్ సైకిళ్లు, మరియు పేక ముక్కలు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయ బాబు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు మండలంలో తావులేదని, పేకాట, గ్యాంబ్లింగ్ వంటి చట్టవ్యతిరేక చర్యలపై



నిరంతరం దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు.యువత అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లకుండా జాగ్రత్త పడాలని, ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని ప్రజలకు సూచించారు.పౌరులు తమ గ్రామాల్లో జరుగుతున్న అన్యాయమైన, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలి, సమాచారం అందించిన వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలియజేశారు.

# కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు

## రంపచోడవరం శాసనసభ్యురాలు శిరీష దేవి



**గంగవరం, పెన్ పవర్, జూలై 15:**కూటమి ప్రభుత్వం కు రాష్ట్రంలోని ప్రజల అభివృద్ధి సంక్షేమం ముఖ్యమని అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు లాంటివని రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి అన్నారు. మంగళవారం మండలంలోని సూరంపాలెం పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శిరీష దేవి ఇంటింటికి వెళ్లి గత సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేయడం జరుగుతుందని ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్ వంటివి అమలు చేయడం జరిగిందని త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం జరుగు తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గంగవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాము అర్జున్, కార్యదర్శి డి భాను ప్రకాష్, కనిగిరి రాంబాబు, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, బిజెపి మండల అధ్యక్షులు నీలాలమ్మ, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ ఎన్ శ్రీను, డి రాంబాబు, పి వీరబాబు, సత్యవేణి, ఆదినారాయణ, వెంకట రెడ్డి, సొసైటీ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు..





# సుపరిపాలనలో తొలి అడుగు ప్రతీ హామీని అమలుచేస్తున్నాం:ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట, పెన్ పవర్, జూలై 15:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. మంగళవారం కొత్తపేట మండలం బిళ్లకుర్రు, వానపల్లి గ్రామాల్లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలతో మమేకమై కూటమి అధికారంలోకి వచ్చాక జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం ద్వారా మహిళలకు భారం తప్పిందన్నారు. తల్లికి వందనంతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి నగదు జమ చేసామన్నారు. వైసిపి హయాంలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ఎన్నో పనులు చేపట్టామని ఆయన తెలిపారు. అనంతరం ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన పలువురు ఎమ్మెల్యే బండారు వద్ద తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# చేదువాడ గ్రామంలో “సుపరిపాలనలో తొలి అడుగు” కార్యక్రమం

కాజులూరు , పెన్ పవర్,జూలై 15: చేదువాడ గ్రామంలో “సుపరిపాలనలో తొలి అడుగు” కార్యక్రమం క్రింది 140వ బూత్ పరిధిలో డోర్ టు డోర్ ప్రచారం విజయవంతంగా పూర్తయ్యింది. ప్రజల ??రకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించడం ద్వారా వారికి ప్రభుత్వ హామీలను పరిచయం చేశారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ రెడ్డి శేషారావు, ప్రధాన కార్యదర్శి పాలిక సుబ్రమణ్యం, మండల బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ గుబ్బల నాగేంద్రకుమార్, యూనిట్ ఇన్‌ఛార్జ్ గుత్తాల శేషుకుమార్ పాల్గొని సమర్ధవంతంగా నిర్వహించారు.ప్రజల నుండి సానుకూల స్పందన రావడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెరగడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



# గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

## రైతులకు పొలాల్లోకి వెళ్లటానికి గ్రావెల్ రోడ్లు వేయాలి

**టీ నర్సాపురం, పెన్ పవర్, జులై 15 :** గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం ముందు రైతులకు పొలాల్లోకి వెళ్ళటానికి గ్రావెల్ రోడ్లు వేస్తామని అలాగే హైవే పక్కన సర్వీసు రోడ్డు వేస్తామని చెప్పి ఈనాడు కనీసం రైతులు తమ పొలాల్లో నుంచి పంట తెచ్చుకోవడానికి వీలు లేకుండా పెద్ద పెద్ద గోతులు ఉంచి అలాగే స్తంభాలు పాతి వలలు వేశారని మండల కేంద్రమైన టీ నర్సాపురం లో ఎగ్జిట్ రోడ్డు ఇవ్వాలని రైతులు టీ నర్సాపురం లో మక్కినవారిగూడెం రోడ్డులో హైవే రోడ్డు వద్ద సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి పంపడానికి నివేదిక తయారు చేశారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే వారు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పొలాల్లోకి వెళ్లడానికి రోడ్డు అలాగే పంట బయటికి తెచ్చుకోవడానికి సర్వీస్ రోడ్డు వెంటనే వేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం వెంటనే సర్వీస్ రోడ్డు రైతులకు పంట పొలాల్లోకి వెళ్ళటానికి గ్రావెల్ రోడ్లు వేసేలా హైవే కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు దీనిపై మండలంలోని రైతులందరూ త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమం



చేపట్టడానికి సిద్ధంగా ఉంటున్నామని ఈ కార్యక్రమానికి ఒక కమిటీని వేసుకొని మండలంలోని రైతులందరూ సమిష్టిగా పోరాటం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు,కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# శుభాంశు శుక్లా భూమికి తిరిగొచ్చాడు..



హైదరాబాద్ పెన్ పవర్: భారత యువ వ్యోమగామి శుభాంశు శుక్లా తన అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించి భూమికి సురక్షితంగా తిరిగివచ్చాడు. ఈ వార్త దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తం అవుతోంది. శుభాంశు ల్యాండింగ్‌ను లక్నోలో ఉన్న ఆయన తల్లిదండ్రులు ప్రత్యక్షంగా వీక్షించారు. ల్యాండింగ్ సక్సెస్ అయిన క్షణంలో వారి ఆనందానికి అవధులు లేకపోయాయి. కుటుంబ సభ్యులంతా ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. ఈ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

**అంతరిక్షంలో 18 రోజులు**

శుభాంశు శుక్లా అమెరికాలో నిర్వహించిన ఓ ప్రయోగాత్మక అంతరిక్ష మిషన్‌లో భాగంగా ఇతర అంతర్జాతీయ వ్యోమగాములతో కలిసి మొత్తం 18 రోజులపాటు అంతరిక్షంలో గడిపారు. ఈ ప్రయాణంలో ఆయన అనేక కీలక శాస్త్రీయ పరిశోధనల్లో పాలుపంచుకున్నారు. అంతరిక్షంలో గడిపిన అనుభవం, మానవ శరీరంపై అంతరిక్ష ప్రయాణ ప్రభావాలు, పరిసరాల్లో ఉన్న సూక్ష్మ జీవుల అధ్యయనాలు వంటి అంశాలపై శుభాంశు కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ఆయన పరిశోధనలు భవిష్యత్తు అంతరిక్ష ప్రయోగాలకు ఎంతో ఉపయోగపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**తల్లిదండ్రుల ఆనందం**

అంతరిక్షానికి వెళ్లే సమయంలో శుభాంశు తల్లిదండ్రులు మిగిలిన భారతీయుల మాదిరిగానే గర్వంతో పాటు కాస్త ఆందోళనతో కూడిన భావోద్వేగాలను వ్యక్తం చేశారు. తమ బిడ్డ అంతరిక్షంలో ఉన్నంత కాలం వారి గుండెలు ముకు బిగించుకున్నట్లే ఉన్నాయని వారు తెలిపారు. అయితే శుభంగా భూమికి తిరిగొచ్చిన సందర్భంగా వారి కళ్లలో ఆనందభాష్పాలు కనిపించాయి. ఇది ప్రతి తల్లిదండ్రులకూ గర్వకారణమైన క్షణం.

**భారత ప్రగతికి నిదర్శనం**

శుభాంశు శుక్లా వంటి యువత అంతరిక్ష పరిశోధనల వైపు అడుగులు వేయడం భారత విజ్ఞానపరమైన ప్రగతికి నిదర్శనంగా భావించవచ్చు. ఆయన సాధించిన ఈ విజయంతో యావత్ దేశం గర్వపడుతోంది. భవిష్యత్తులో మరిన్ని శాస్త్రీయ విజయాలను సాధించాలని శుభాంశుకు ఎంతో మంది శుభాకాంక్షలు తెలుపుతున్నారు. భారత యువతకు ఆయన స్ఫూర్తిగా నిలుస్తారని ఆశిద్దాం.


# కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి ఫైర్.. ఈ సారి బలైపోయిందో ఎవరో తెలుసా?



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో ఫైర్ బ్రాండ్ ఎమ్మెల్యేల్లో ముందుండే పేరు రెడ్డప్పగారి మాధవీరెడ్డి. కడప ఎమ్మెల్యే అయిన మాధవీరెడ్డి ప్రభుత్వ విప్ గా కూడా బాధ్యతలు నెరవేరుస్తున్నారు. ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచినా దూకుడుగా రాజకీయాలు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు ఎమ్మెల్యే మాధవిరెడ్డి. మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాల్లో వేదికపై తనకు కుర్చీ వేయాలని పట్టుబట్టి మరీ సాధించిన ఎమ్మెల్యే.. ఇతర వ్యవహారాల్లోనూ అంతే దూకుడుగా పనిచేస్తుంటారు. తాజాగా వార్డు సచివాలయ ఉద్యోగిపై ఆమె కన్నెర్రజేశారు. వందల మంది సమక్షంలో ఉద్యోగికి వార్నింగ్ ఇస్తున్న వీడియో వైరల్ గా మారింది. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా కడప నగరంలో పర్యటిస్తున్న మాధవీరెడ్డి రేషన్ కార్డుల సమస్యపై కొందరు మహిళలు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాధవీరెడ్డి పక్కనే ఉన్న సచివాలయ ఉద్యోగిని ప్రశ్నించారు. దీనికి ఆయన వైసీపీ కార్పొరేటర్ ను అడగాలని చెప్పడంతో ఎమ్మెల్యే మాధవిరెడ్డికి చిర్రెత్తుకొచ్చిందని చెబుతున్నారు. ఓ ప్రభుత్వ ఉద్యోగి తన దృష్టికి వచ్చే సమస్యపై కార్పొరేటర్ ను అడగమనడం ఏంటని ఆశ్చర్యంతోపాటు ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.. కార్పొరేటర్ కు బ్రోకర్ గా పనిచేస్తున్నావా? అంటూ ఉద్యోగిని నిలదీశారు. ప్రభుత్వం వద్ద జీతం తీసుకుంటూ బ్రోకర్ పనులు చేయొద్దు అంటూ మందలించారు. అయితే ఓ ఉద్యోగిని ఎమ్మెల్యే 'బ్రోకర్' అనడంపై విపక్షం మండిపడుతోంది. ఉద్యోగులను పట్టుకుని తిడతారా? అంటూ నిలదీస్తోంది.

ఈ విషయమై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ఎలా ఉన్నా, సచివాలయ ఉద్యోగిపై మాధవిరెడ్డి రియాక్షన్ చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేగా గెలిచిన నుంచి ఆమె లేడీ సివంగిలా పనిచేస్తున్నారని టీడీపీ నేతలు ప్రశంసిస్తున్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహనరెడ్డి సొంత జిల్లాలో టీడీపీ తరఫున ఆమె చేస్తున్న పోరాటంపై ఆ పార్టీ సోషల్ మీడియా నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో గన్నవరంలో మాజీ ఎమ్మెల్యే వంశీతో వివాదానికి దిగిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ప్రాంతం ఏదైనా పార్టీ తరఫున మాధవిరెడ్డి ఎలాంటి భయం లేకుండా పోరాటం చేయడం విశేషంగా చెబుతున్నారు. ఇక తాజా వివాదంలో వైసీపీ విమర్శలను మాధవిరెడ్డి ఎలా అధిగమిస్తారో చూడాల్సివుంది.


# బోయింగ్ ఇంధన స్విచ్‌లపై ముందే హెచ్చరికలు



హైదరాబాద్ పెన్ పవర్: అహ్మదాబాద్ విమాన ప్రమాదం నేపథ్యంలో బోయింగ్ విమానాల్లోని ఇంధన స్విచ్‌లపై తీవ్ర చర్చ మొదలైంది. ఇటీవల వెలువడిన ప్రాథమిక దర్యాప్తు నివేదిక ప్రకారం.. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం రెండు ఇంజిన్లకు ఒక్కసారిగా ఇంధన సరఫరా ఆగిపోవడమేనని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో బోయింగ్ విమానాల్లోని ఇంధన స్విచ్‌లపై అనుమానాలు మరింత బలపడ్డాయి. ఇదే సమయంలో యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన పౌర విమానయాన అథారిటీ ఇచ్చిన పాత హెచ్చరికలు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. మే 15న అంటే అహ్మదాబాద్ ప్రమాదానికి దాదాపు నెల్లాళ్ల రోజుల ముందు.. బ్రిటన్ సీఏఏ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్‌తో పాటు ఐదు రకాల బోయింగ్ విమానాల్లోని ఇంధన షటాఫ్ వాల్వ్ యాక్చువేటర్లపై భద్రతా నోటీసును జారీ చేసింది. అంతేకాకుండా, అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) విడుదల చేసిన ఎయిర్‌వర్తినెస్ డైరెక్టివ్ లోనూ ఇదే అంశంపై సుస్పష్టమైన హెచ్చరికలు ఉన్నాయి. దీనిని అనుసరించి ఆయా విమానాల్లో ఇంధన షటాఫ్ వాల్వ్‌లను నిత్యం తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రమాదం జరగడం ఆందోళన కలిగిస్తోంది.

ఈ పరిణామాలపై భారత డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కూడా స్పందించింది. దేశీయ ఎయిర్‌లైన్స్ వద్ద ఉన్న బోయింగ్ 787, 737 మోడళ్ల విమానాల్లో ఇంధన స్విచ్‌ల లాకింగ్ వ్యవస్థలను పర్యవేక్షించాలని, పూర్తిస్థాయిలో తనిఖీలు జరిపి సంబంధిత నివేదికలను డీజీసీఏకు సమర్పించాలని ఆదేశించింది. ఈ ఘటనతో బోయింగ్ విమానాల భద్రతపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు మొదలయ్యాయి. అంతర్జాతీయ విమానయాన రంగం లోపాలను పట్టించుకుని తగిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను ఈ ప్రమాదం మరోసారి స్పష్టం చేస్తోంది. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ దుర్ఘటన గుర్తుచేస్తుంది.

# స్టోర్ లో దొంగతనం.. భారతీయురాలి అరెస్ట్.. అమెరికాలో ఇదో గుణపాఠం



హైదరాబాద్ పెన్ పవర్: అమెరికా ఇలినాయిస్‌లోని మెక్‌హెన్రీ కౌంటీలో జరిగిన ఒక సంఘటన భారతీయులకు... ముఖ్యంగా అమెరికా వెళ్లే వారికి తీవ్ర హెచ్చరికగా నిలుస్తోంది. షాపింగ్ కోసం వచ్చిన ఒక మధ్యవయస్కురాలైన భారతీయ మహిళ అవ్లానీ జిమిషా.. టార్గెట్ స్టోర్‌లో సుమారు రూ. 1,08,000 ($1,300) విలువైన వస్తువులను దొంగిలించడానికి ప్రయత్నించి అరెస్టయ్యారు. ఈ ఘటన అమెరికాలో చిన్న నేరంగా భావించబడే దుకాణాల దొంగతనం ఎంత తీవ్రమైన పరిణామాలను కలిగిస్తుందో స్పష్టం చేస్తోంది.

టార్గెట్ స్టోర్ భద్రతా సిబ్బంది జిమిషాను ఏడు గంటలకు పైగా అనుమానాస్పదంగా గమనించారు. ఆమె షాపింగ్ చేస్తున్న తీరుపై అనుమానం రావడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అరగంటలోపే ఒక మహిళా పోలీసు అధికారిణితో సహా ముగ్గురు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. దాదాపు నాలుగు గంటల పాటు జిమిషాను విచారించారు. విచారణ సమయంలో జిమిషా పదేపదే క్షమాపణలు చెబుతూ, తన వద్ద డబ్బు ఉందని, కొనుగోలు మొత్తాన్ని వెంటనే చెల్లిస్తానని వేడుకుందని స్థానిక మీడియా తెలిపింది. అయితే పోలీసులు, ముఖ్యంగా మహిళా పోలీసు అధికారిణి ఆమె మాటలకు కించిత్ కూడా సానుభూతి చూపలేదు. ఒక దశలో ఆ అధికారిణి "మీ దేశంలో కూడా ఇలా దొంగతనాలు చేస్తారా?" అని ఘాటుగా ప్రశ్నించినట్లు సమాచారం. చివరికి, జిమిషాను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి, చట్టపరమైన కేసు నమోదు చేశారు.

**ఒక్క దొంగతనమే... జీవితకాల నింద**

అమెరికాలో దుకాణాల దొంగతనాన్ని కేవలం చిన్న పొరపాటుగా చూడరు. ఇది ఒక తీవ్రమైన నేరం. ఈ నేరం నమోదైన తర్వాత అది జీవితాంతం మీపై మచ్చగా మిగిలిపోతుంది. మీరు క్షమించమని అడిగినా, డబ్బు చెల్లిస్తానని చెప్పినా అది చట్టపరమైన ప్రక్రియను ఆపదు.

**ఈ సంఘటన నుంచి భారతీయులు నేర్చుకోవాల్సిన గుణపాఠాలు:**

నేర రికార్డులు భవిష్యత్తులో వీసా పొందడంలో లేదా ఇమ్మిగ్రేషన్ స్టేటస్‌ను కొనసాగించడంలో తీవ్రమైన సమస్యలను సృష్టిస్తాయి. మీ పాస్‌పోర్ట్‌పై నేర చరిత్ర నమోదు కావచ్చు, ఇది అంతర్జాతీయ ప్రయాణాలపై ప్రభావం చూపుతుంది. వ్యక్తిగతంగా, సామాజికంగా తీవ్ర అవమానం ఎదుర్కోవాల్సి వస్తుంది. మీ ఒక్కరి చర్య దేశానికి కూడా అప్రతిష్టను తీసుకువస్తుంది.

**భారతీయులకు హెచ్చరిక:**

అమెరికాలో ఉన్నప్పుడు అక్కడి చట్టాలను గౌరవించడం అత్యవసరం. చిన్న తప్పిదంగా కనిపించేది కూడా అక్కడ తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది. నిజాయితీగా జీవించడమే గౌరవప్రదం, అవమానాన్ని కొనితెచ్చుకోవడం కాదు.

# నిమిషా ప్రియా ఉరిశిక్ష వాయిదా విషయంలో 'బ్లడ్ మనీ' పాత్ర ఏంటి..?



హైదరాబాద్ పెన్ పవర్: కేరళకు చెందిన నిమిషా ప్రియాకు యెమెన్ లో ఉరిశిక్ష పడింది. ఆ దేశస్థుడిని హత్య చేసిన కారణంగా అక్కడి కోర్టు ఆమెకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును జూలై 16, 2025న అమలు చేసేందుకు అన్ని సన్నాహాలు చేశారు. కానీ చివరి నిమిషంలో ఆమె ఉరిశిక్ష వాయిదా వేసినట్లు అక్కడి ప్రభుత్వం భారత్ కు సమాచారం ఇచ్చింది. ఇందులో 'బ్లడ్ మనీ' కీలక పాత్ర ఉంటుందని వాదనలు వినిపిస్తున్నాయి. చివరి నిమిషంలో ఉరిశిక్ష వాయిదా పడడం చాలా అరుదుగా సంభవిస్తుంది. అసలు ఏంటి ఈ 'బ్లడ్ మనీ' ఇది ఎలా చెల్లిస్తారు. ఇది చెల్లిస్తే శిక్షల నుంచి బయటపడవచ్చా చూద్దాం..

**బ్లడ్ మనీ అంటే..**

క్షమాపణకు బదులుగా బాధిత వ్యక్తి కుటుంబానికి చెల్లించే పరిహారమే 'బ్లడ్ మనీ'. ఖురాన్ లో దీని గురించి ప్రస్తావన ఉంది. 'ఇస్లాంను నమ్మే వ్యక్తిని హత్య చేస్తే మరణించిన కుటుంబానికి బ్లడ్ మనీ ఇవ్వాలి. ఒక వేళ బ్లడ్ మనీని భరించలేకపోయిన వారు వరుసగా రెండు నెలలు ఉపవాసం ఉండాలి' అని ఉంది. షరియా చట్టంలో దీన్ని తీసుకువచ్చాయి కొన్ని దేశాలు. ముఖ్యంగా యెమెన్, సౌదీ అరేబియా, ఇరాన్, పాకిస్తాన్ తో సహా కొన్ని ఇస్లామిక్ దేశాలు బ్లడ్ మనీని చట్టంగా చేశాయి. అంటే ఒక వ్యక్తి నేరం చేస్తే ఆ నేరం వలన బాధపడిన వారు, వారి కుటుంబ సభ్యులు కొంత మేర డబ్బును డిమాండ్ చేయవచ్చు. దీన్నే 'బ్లడ్ మనీ' అంటారు. షరియా చట్టం ప్రకారం బ్లడ్ మనీకి తలాల్ అబ్దో మెహదీ కుటుంబం అంగీకరిస్తే ఉరిశిక్ష నుంచి తప్పించుకోవచ్చు. ప్రభుత్వం నుంచి క్షమాభిక్ష కూడా దొరుకుతుంది. బ్లడ్ మనీ అనేది క్రీస్తు శకం, ఏడో శతాబ్దం నుంచి వస్తుంది. ప్రధానంగా హింసకు గురయ్యే వారు దీని ద్వారా ఉప శమనం పొందుతారు. ఏడో శతాబ్దం ఒంటెలు, జంతువులు, బంగారం లాంటివి బ్లడ్ మనీ కింద తీసుకునేవారు. కానీ ఇప్పుడు డబ్బులు తీసుకుంటున్నారు.

**ఇప్పటి వరకు బ్లడ్ మనీ కేసులు**

2017లో కేరళకు చెందిన ఎస్ఎస్ శంకర్ నారాయణన్ తన ఇంట్లో ఎలక్ట్రీషియన్ గా పనిచేస్తున్న (బంగ్లాదేశ్ కు చెందిన) కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే యూఏఈ జైలులో 8 సంవత్సరాలు గడిపాడు. 2 లక్షల దిర్హామ్స్ (రూ. 47 లక్షలు) చెల్లించాలని ఆదేశాలు వచ్చాయి. కానీ అతని వద్ద అంత డబ్బు లేదు. దీంతో ఒక వార్తా పత్రికలో ఆయన దీన స్థితిని ప్రచురించడంతో విరాళాలు పెరిగాయి. దీనికి తోడు ఓమిర్స్ ఇస్లామిక్ బ్యాంక్ కొంత డబ్బు ఇవ్వడంతో బయటపడ్డాడు.

2017లోనే సౌదీలో అక్కడి వ్యక్తిని తెలంగాణ వాసి లింబాద్రి హత్య చేసిన ఘటనలో ఉరిశిక్ష పడింది. పదేళ్ల జైలులో ఉన్న తర్వాత స్థానిక వ్యాపార వేత్త సాయంతో తెలంగాణ రాజకీయ నాయకురాలు కవిత జోక్యంతో లింబాద్రి ఇంటికి వచ్చాడు.

2014లో కూడా ముగ్గురు భారతీయులు, ఒక సౌదీ వ్యక్తి కలిసి బిజినెస్ చేయగా.. వారి మధ్య వచ్చిన విభేదాలతో ముగ్గురు భారతీయులు సౌదీ వ్యక్తిని హత్య చేశారు. నిందితులైన ముగ్గురికి అక్కడి కోర్టు మరణ శిక్ష విధించింది. ఇందులో ఒక వ్యాపార వేత్త బ్లడ్ మనీ కింద రూ. 1.5 కోట్లు చెల్లించడంతో ముగ్గురు విడుదలయ్యారు. రియాద్ లో తన యజమాని మైనర్ కొడుకు ప్రమాదవశాత్తు హత్య చేసినట్లు రుజువు కావడంతో కేరళకు చెందిన అబ్దుల్ రహీమ్ కు కోర్టు ఉరి శిక్ష విధించింది. బాలుడి కుటుంబం రూ. 34 కోట్ల దియా (బ్లడ్ మనీ) చెల్లించడంతో మరణశిక్ష నుంచి తప్పించుకున్నాడు. మలయాళీ సమాజం విరాళంగా ఈ మొత్తాన్ని సేకరించింది. ఉరిశిక్షను తొలగించి 20 ఏళ్ల శిక్ష విధించారు. ఇందులో ఇప్పటికే అనుభవిస్తున్న కారాగార కాలం పరిగణలోకి తీసుకుంటే డిసెంబర్, 2026లో అబ్దుల్ రహీమ్ విడుదల కానున్నాడు.

# ఏడాదిలో వచ్చిన మేడే కాల్స్ ఇవే.. అన్నింటినీ సేఫ్ ల్యాండ్ చేసిన పైలట్లు..



హైదరాబాద్ పెన్ పవర్: గత నెల జూన్ 12న ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787-8 వీటీ-ఏఎన్‌బీ టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లో కూలిపోయింది. అహ్మదాబాద్ లోని బీజే మెడికల్ కాలేజ్ హాస్టల్ పై కుప్ప కూలింది. ఈ ప్రమాదంలో ఫ్లైట్ లో ఉన్న 12 మంది సిబ్బంది 242 మంది ప్రయాణికుల్లో ఒక్కరు మాత్రమే బతికి బయటపడ్డారు. ఇక హాస్టల్ కు చెందిన 29 మంది కూడా మరణించారు. అందరూ అగ్నికి ఆహుతయ్యారు. ఈ ఘటన మొత్తం దేశాన్ని కుదిపివేసింది. డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి సగం కాలిన మృతదేహాలను అప్పగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రమాదం భారత విమానయాన చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోతుంది. ఇది ఉగ్రదాడి అని కొందరంటే.. మానవ తప్పిదం అని మరికొందరు.. లేదు లేదు టెక్నికల్ ఎర్రర్ అని ఇంకొందరు అన్నారు. ఏది ఏమైనా 253 మంది బతికి రాలేరు కదా.. కన్న వారి కట్టుకున్న వారికి జీవితకాలం కన్నీరే కదా..

మానవ రవాణా వ్యవస్థల్లో వాయు వ్యవస్థ అత్యంత కీలకమైంది. తక్కువ సమయంలో ఎక్కువ దూరం ప్రయాణించాలంటే ఇదొక్కటే మార్గం బినా మరోటి లేదు. అందుకే ఎక్కువ మంది దీన్నే ఆశ్రయిస్తుంటారు. దాదాపు విమానయానంలో ప్రమాదాలు తక్కువగానే జరిగాయి. కానీ ప్రమాదం జరిగినప్పుడల్లా వందల్లో ప్రాణాలు గాల్లోనే కలిసిపోతున్నాయి. ఒక్కోసారి ఒక్కో ఫ్లయిట్ ఎక్కడ మిస్ అయ్యిందో కూడా తెలియకుండా మిస్టరీగా మిగిలిపోతుంది. విమాన ప్రమాదాలను తగ్గించేందుకు చాలా వరకు సైంటిస్టులు ప్రయత్నాలు చేస్తున్నారు. సాధ్యం అయినంత వరకు తగ్గిస్తూనే వస్తున్నారు. ఒక్కోసారి హ్యూమన్ ఎర్రర్, మరోసారి టెక్నికల్ ఎర్రర్ తో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇటీవల జరిగిన 787-8 విమానానికి సంబంధించి బ్లాక్ బాక్స్ ను పరిశీలించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కొన్ని విషయాలను వెల్లడించింది. 2024, జనవరి 1 నుంచి 2025, మే 31 వరకు విమాన, నౌకాయానికి సంబంధించి 11 మేడే కాల్స్ నమోదైతే అందులో దాదాపుగా అన్ని పైలట్ల చాకచక్యంతో తప్పాయని పేర్కొంది. చాలా వరకు సమస్యలను పైలట్లే పరిష్కరిస్తారని అర్థం అయ్యింది. మరి ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8కు సంబంధించి ఏం జరిగి ఉంటుంది. క్లుప్తంగా చెప్పుకుంటే ఎయిర్ ఇండియా విమాన సర్వీసుల్లో కొన్ని లోపాలు ఉన్నట్లు డీజీసీఏ వెల్లడించింది.

**200కు పైగా ప్రాణాలను పొట్టన పెట్టుకున్న స్విచ్..**

బోయింగ్ విమానాలను నడిపే పైలెట్లు చాలా వరకు సీనియర్లు అయ్యుంటారు. ఎక్కువ కిలో మీటర్లు ఫ్లయింగ్ చేసిన వారినే వీటిని నడిపేందుకు ఆయా సంస్థలు ఎన్నుకుంటాయి. ఈ విమానం నడిపిన పైలట్ కు కూడా చాలా అనుభవం ఉంది. కాక్ పిట్ లో కూడా వీరి మధ్య సంభాషణలు జరిగినట్లు రికార్డు అయ్యింది. 787-8 బోయింగ్ విమానంలో ఇంజిన్లకు ఇంధనం సరఫరా చేసే స్విచ్ కటాఫ్ (బంద్)లో ఉన్నట్లు ఒక పైలట్ గుర్తించాడు. ఇది టేకాఫ్ అయిన క్షణాల్లో గుర్తించి మరో పైలెట్ ను ప్రశ్నించాడు. తాను చేయలేదని కో పైలెట్ చెప్పాడు. వెంటనే ఆన్ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇంజిన్ ఆగి ఆగి స్టార్ట్ కావడంతో వేగం అందుకోలేక కుప్పకూలింది. సాధారణంగా ఈ స్విచ్ అంత తేలికగా కటాఫ్ కాదని టెక్నీషియన్స్ చెప్తున్నారు. కానీ ఈ ప్రమాదంలో హ్యూమన్ ఎర్రరా.. లేదంటే టెక్నికల్ ఎర్రరా అనేది ఇంకా స్పష్టతరాలేదు.

# 8 ఏళ్ళ తర్వాత రీ ఎంట్రీ: నాలుగో టెస్టుకు ఇంగ్లాండ్ స్క్వాడ్ ప్రకటన





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాతో జరగబోయే నాలుగో టెస్ట్ కోసం ఇంగ్లాండ్ తమ స్క్వాడ్ ను ప్రకటించింది. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (%జుజదీ%) మంగళవారం (జూలై 15) 14 మంది ఆటగాళ్లతో కూడిన ఇంగ్లాండ్ జట్టును ప్రకటించింది. గాయంతో సిరీస్ కు దూరమైన ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో మరో ఆఫ్ స్పిన్నర్ లియామ్ డాసన్‌ను జట్టులోకి చేర్చుకుంది. ఈ ఒక్క మార్పు మినహా కొత్త ఆటగాళ్లెవరూ స్క్వాడ్ లోకి రాలేదు. ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య నాలుగో టెస్టు ఈ నెల 23 నుంచి మాంచెస్టర్‌లో జరుగుతుంది. ప్రస్తుతం 3 టెస్ట్ మ్యాచ్ లు జరగగా ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలో నిలిచింది.

**8 ఏళ్ళ తర్వాత డాసన్**

డాసన్ 8 ఏళ్ళ తర్వాత ఇంగ్లాండ్ టెస్ట్ స్క్వాడ్ లో స్థానం సంపాదించాడు. బషీర్ లేకపోవడంతో నాలుగో టెస్టుకు డాసన్ కు ఏకైక స్పిన్నర్ గా ప్లేయింగ్ 11 లో చోటు దక్కే అవకాశం ఉంది. చివరిసారిగా జూలై 2017లో ఇంగ్లాండ్ తరఫున డాసన్ టెస్ట్ క్రికెట్ ఆడాడు. 35 ఏళ్ల ఈ ఆఫ్ స్పిన్నర్ కొన్నేళ్లుగా హాంప్‌షైర్ తరపున నిలకడగా ఆడుతున్నాడు. 2023, 2024లో PCA ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికయ్యాడు. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు స్క్వాడ్ నుంచి పేసర్లు సామ్ కుక్, జామీ ఓవర్టన్‌లను విడుదల చేసింది. వీరిద్దరూ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఆడటానికి అనుమతిని ఇచ్చారు.

**బషీర్ కు గాయం:**

ఇంగ్లాండ్ ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ గాయంతో టెస్ట్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. టీమిండియాతో జరిగిన మూడో టెస్టులో భాగంగా మూడో రోజు బషీర్ ఎడమ చేతి చిటికెన వేలికి గాయం అయింది. స్కాన్ చేస్తే పగుళ్లు ఉండడంతో సర్జరీ అవసరమని డాక్టర్లు సూచించారు. దీంతో నాలుగు, ఐదు టెస్టులకు ఈ ఇంగ్లాండ్ ప్రధాన స్పిన్న దూరమయ్యాడు. టీమిండియా తొలి ఇన్నింగ్స్ 78వ ఓవర్‌లో బషీర్ వేసిన బంతిని జడేజా బలంగా బాదాడు. బంతిని ఆపే క్రమంలో బషీర్ చేతికి బలంగా తగిలింది. దీంతో బౌలింగ్ చేయలేక ఓవర్ మధ్యలోనే బషీర్ గ్రౌండ్ వదిలి వెళ్ళిపోయాడు. మిగిలిన ఓవర్ రూట్ పూర్తి చేశాడు.

విరిగిన వేలు తోనే బషీర్ నాలుగో రోజు బ్యాటింగ్ కు వచ్చాడు. ఐదో రోజు కూడా జట్టు కోసం గాయంతోనే బౌలింగ్ చేశాడు. ఐదో రోజు తీవ్ర ఉత్కంఠ సమయంలో సిరాజ్ వికెట్ తీసి బషీర్ ఇంగ్లాండ్ కు చివరి వికెట్ అందించాడు. దీంతో ఇంగ్లాండ్ థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది.

**టీమిండియాతో 4వ టెస్ట్ కు ఇంగ్లాండ్ స్క్వాడ్:**

బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడాన్ కార్స్, జాక్ క్రాలే, లియామ్ డాసన్, బెన్ డకెట్, ఓల్లీ పోప్, జో రూట్, జామీ స్మిత్ (వికెట్ కీపర్), జోష్ టంగ్, క్రిస్ వోక్స్.

# ఒక్క హాఫ్ సెంచరీ లేదు.. 516 పరుగులు.. 40 వికెట్లు: ఆసీస్, విండీస్ టెస్టులో 5 మిరాకిల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** జమైకాలో కింగ్ స్టన్ వేదికగా సబీనా పార్క్ లో వెస్టిండీస్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్ లో బౌలర్లు వికెట్ల వర్షం కురిపించారు. బౌలర్లు విజృంభించి రెండున్నర రోజుల్లోనే 40 వికెట్లు కూల్చారు. ఈ టెస్టులో ఆస్ట్రేలియా బౌలర్లు అత్యద్భుతంగా చెలరేగడంతో వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్ లో కేవలం 27 పరుగులకే ఆలౌట్ అయింది. ఆద్యంతం బౌలర్లు ఆధిపత్యం చూపించిన ఈ మ్యాచ్ లో వెస్టిండీస్ పై ఆస్ట్రేలియా 176 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ చెప్పుకోవాలంటే చాలానే విశేషాలు ఉన్నాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం..

**పదేళ్ల తర్వాత తొలిసారి:**

ఈ టెస్ట్ మ్యాచ్ లో నాలుగు ఇన్నింగ్స్ ల్లో ఒక్క హాఫ్ సెంచరీ కూడా నమోదు కాలేదు. స్టీవ్ స్మిత్ చేసిన 48 పరుగులు అత్యధికం. 2015 తర్వాత ఇలా జరగడం ఐదు తొలిసారి. నాగ్ పూర్ వేదికగా ఇండియా, సౌతాఫ్రికా జట్ల మధ్య జరిగిన ఈ టెస్టులో ఒక్క హాఫ్ సెంచరీ కూడా ఎవరు కొట్టలేకపోయారు. టీమిండియా ఓపెనర్ మురళీ విజయ్ చేసిన 40 పరుగులు అత్యధికం. ఈ మ్యాచ్ లో భారత్ 124 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

**విండీస్ టెస్ట్ చరిత్రలో అత్యల్ప స్కోర్:**

ఈ టెస్ట్ రెండో ఇన్నింగ్స్ లో వెస్టిండీస్ కేవలం 27 పరుగులే ఆలౌట్ అయింది. స్టార్క్ ఆరు వికెట్లతో చెలరేగడంతో పాటు బోలాండ్ హ్యాట్రిక్ తీయడంతో 205 పరుగుల లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ కేవలం 27 పరుగులకే ఆలౌటై తమ టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోర్ నమోదు చేసింది. ఓవరాల్ గా టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇది రెండో అత్యల్ప స్కోర్.

**బోలాండ్ హ్యాట్రిక్:**

ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోలాండ్ హ్యాట్రిక్ తో చెలరేగాడు. రెండో ఇన్నింగ్స్ లో ఈ ఆసీస్ పేసర్ ఈ ఘనతను అందుకున్నాడు. దీంతో పింక్ బాల్ టెస్ట్ లో హ్యాట్రిక్ తీసిన తొలి బౌలర్ గా చరిత్ర సృష్టించాడు. జస్టిన్ గ్రీవ్స్, షమర్ జోసెఫ్, జోమెల్ వారికన్‌లను వరుస బంతుల్లో బోలాండ్ ఔట్ చేశాడు. దీంతో 2010 తర్వాత టెస్ట్ ఫార్మాట్ లో హ్యాట్రిక్ తీసిన తొలి ఆసీస్ బౌలర్ గా నిలిచాడు.

**స్టార్క్ వరల్డ్ రికార్డ్:**

ఈ టెస్ట్ రెండో ఇన్నింగ్స్ లో స్టార్క్ తన బౌలింగ్ తో విజృంభించి కేవలం 15 బంతుల్లోనే ఐదు వికెట్లు పడగొట్టి ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఫాస్టెస్ట్ 5 వికెట్లు పడగొట్టిన ప్లేయర్ గా చరిత్ర సృష్టించాడు. అంతకముందు టెస్టుల్లో ఈ రికార్డ్ ఎర్నీ టోషాక్ (ఆస్ట్రేలియా), స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లాండ్) , స్కాట్ బోలాండ్ (ఆస్ట్రేలియా) పేరిట ఉంది. ఈ ముగ్గురు 19 బంతుల్లో 5 వికెట్లను పడగొట్టారు. తాజాగా స్టార్క్ ఈ రికార్డ్ ను అధిగమించి టాప్ కు చేరాడు.

ఓవరాల్ గా 7.3 ఓవర్లలో కేవలం 9 పరుగులే ఇచ్చిన స్టార్క్.. ఆరు వికెట్లు పడగొట్టాడు. స్టార్క్ తన తొలి ఓవర్ లోనే మూడు వికెట్లు పడగొట్టడం విశేషం. దీంతో పాటు ఈ మ్యాచ్ లో స్టార్క్ టెస్ట్ క్రికెట్ లో 400 వికెట్లను పూర్తి చేసుకొని ఈ ఘనత సాధించిన రెండో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ గా ఓవరాల్ గా నాలుగో ఆసీస్ బౌలర్ గా నిలిచాడు. స్టార్క్ ఆరు వికెట్లతో విజృంభించడంతో విండీస్ జట్టు ఏ దశలోనూ కోలుకోలేకపోయింది.

**ఏడుగురు డకౌట్స్:**

రెండో ఇన్నింగ్స్ లో ఏకంగా ఏడుగురు వెస్టిండీస్ క్రికెటర్లు డకౌట్ కావడం షాకింగ్ కు గురి చేస్తుంది. 148 ఏళ్ళ టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక ఇన్నింగ్స్ లో ఏడుగురు డకౌట్ కావడం ఇదే తొలిసారి. అంతకముందు అత్యధికంగా ఆరుగురు డకౌటైన రికార్డును విండీస్ చెత్త రికార్డ్ తమ ఖాతాలో వేసుకుంది. జాన్ కాంప్‌బెల్, కెవెలాన్ ఆండర్సన్, బ్రెండన్ కింగ్, రోస్టన్ చేజ్, షెమర్ జోసెఫ్, జోమెల్ వారికన్, జేడెన్ సీల్స్ ఈ మ్యాచ్ లో డకౌటయ్యారు.

ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియా 225 పరుగులకు ఆలౌట్ అయింది. స్మిత్ 48 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. షామర్ జోసెఫ్ 4 వికెట్లతో చెలరేగాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ 143 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో తొలి ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియాకు 82 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియా 121 పరుగులకే ఆలౌట్ అయింది. 205 పరుగుల లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ 27 పరుగులకు ఆలౌట్ అయింది. ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ కే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు లభించాయి.

# టాలీవుడ్ లో దీపిక-ప్రియాంక మధ్య పోటీ!

హీరోయిన్ల మధ్య పోటీ అన్నది సహజం. ఒకరి అవకాశాలు మరొకరు తన్నుకుపోతుంటారు. కొన్ని అవకాశాల కోసం టార్గెట్ గా బిహైండ్ రాజకీయం చేస్తుంటారు. ఈ రకమైన పోటీ స్టార్ హీరోయిన్ల మధ్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. భవిష్యత్ లో ఇలాంటి పోటీ దీపికా పదుకొణే-ప్రియాంక చోప్రా మధ్య కూడా తప్పేలా లేదు. అందులోనూ ఇద్దరు టాలీవుడ్ లో ఈ పోటీ పడే అవకాశం కనిపిస్తుంది. 'కల్కి' తో దీపికా పదుకొణే టాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా హిట్ తో పాన్ ఇండియాలో ఫేమస్ అయింది. బాలీవుడ్ సినిమా కంటే ఓ తెలుగు సినిమాతోనే దేశి విదేశాల్లో ఎక్కువ గుర్తింపు దక్కింది. ఈ నేపథ్యంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చిత్రం కోసం హీరోయిన్ గా ఎంపిక చేసారు. అమ్మడు ఇందులో బన్నీ సరసన నటిస్తుం ది. ఈ సినిమా తర్వాత దీపిక పాన్ ఇండియా రేంజ్ అంతకంతకు రెట్టింపు అవుతుంది.





కృతి శెట్టి యొక్క కూల్ క్లిక్ హృదయాలను ద్రవింపజేస్తుంది

అటు గ్లోబల్ స్టార్ గా నీరాజనాలు అందుకుంటోన్న ప్రియాంక చోప్రా బాలీవుడ్ సినిమాలను సైతం కాదని టాలీవుడ్ లో ఎస్ఎస్ ఎంబీ 29 తో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఎంతో మంది భామల పేర్లను పరిశీలించిన అనంతరం ప్రియాంక లాక్ అయింది. ఈ ప్రాజెక్ట్ ను ఆమె అంగీకరించడం కూడా గొప్ప విషయమే. హాలీవుడ్ లో ప్రియాంక చోప్రా ఎంతో బిజీ నటి. వందల కోట్ల రూపాయలు పారితోషికంగా తీసుకుంటుంది. పీసీతో సినిమా చేయాలని బాలీవుడ్ కూడా ఎన్నో ప్రయత్నాలు చేస్తుంది. వాళ్లను సైతం కాదని పీసీ రాజమౌళి సినిమాకు ఒకే చెప్పడం మరో పెద్ద విషయం. ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా ఈ చిత్రం రూపొందుతుంది.

అటు బన్నీ చిత్రం పై కూడా క్రేజ్ అలాగే ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు సినిమాలు భారీ విజయం సాధించిన తర్వాత ఇండియాలో హీరోయిన్ల ఇద్దరి క్రేజ్ రెట్టింపు అవుతుంది. అటుపై వాళ్లు కమిట్ అయ్యే కొత్త ప్రాజెక్ట్ లు అంతే ఆసక్తికరంగా ఉంటాయి. ముఖ్యంగా టాలీవుడ్ లో ఇద్దరి మధ్య తగ్గాఫ్ వార్ నడిచే అవకాశం ఉంటుంది. అవకాశాల పరంగా భామలిద్దరు పోటీ పడినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఒకసారి పోటీ మొదలైందంటే? దాని పర్యవసానాలు ఎలా ఉంటాయి? అన్నది చెప్పాల్సిన పనిలేదు. నువ్వా? నేనా? అన్న రేంజ్ వార్ తప్పదు.



శ్రియా శరణ్ పీచ్ ఇట్ అప్ యొక్క పాస్టెల్ డ్రీమ్ లుక్‌లో మెరిసింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com